# తొలివెలుగు

జాతీయ దిన పత్రిక

మన భాష.. మన పత్రిక..

https://tholivelugu.com/

హైదరాబాద్ సంపుటి:01 సంచిక: 164 29-6-2026 వెల: రూ.2/- పేజీలు: 06



విలేకరులు కావలెను

తొలివెలుగు

www.epaper.tholivelugu.com

Contacts

తెలంగాణ

94911 34365

ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల్లో తొలివెలుగు జాతీయ తెలుగు దినపత్రికలో పలు విభాగాల్లో పనిచేయుటకు ఉత్సాహవంతులైన స్టేట్ బ్యూరో, జిల్లా స్టాఫర్లు, నియోజకవర్గ ఇన్‌చార్జ్‌లు, మండల రిపోర్టర్లు కావలెను. ఆసక్తి.. అనుభవం గల వారు సంప్రదించగలరు.


## అది ప్రభుత్వమా, గూండాల రాజ్యమా?

- అమరావతిలో వైసీపీ నేతలపై జరిగిన దాడిని ఖండించిన జగన్
- చంద్రబాబే ఈ దాడిని ఉసిగొల్పారని తీవ్ర ఆరోపణ
- ఈ దుష్ట సంప్రదాయానికి రెట్టింపు స్పందన ఉంటుందని హెచ్చరిక
- రాష్ట్రంలో ప్రభుత్వం నడుపుతున్నారా లేక గూండాల రాజ్యాన్ని కొనసాగిస్తున్నారా?



2లో



## మన కథ ముగిసె...

- చివరి లీగ్ మ్యాచ్‌లో పరాజయం
- 6 వికెట్లతో నెగ్గిన ఆస్ట్రేలియా
- మెరిసిన పెర్రీ, గార్డ్‌నర్ హర్మన్ మెరుపులు వృథా

2లో

## తెలంగాణలో త్వరలో కమలం వికసిస్తుంది



- బెంగాల్ తరహాలో క్షేత్రస్థాయిలో పనిచేయాలని శ్రేణులకు పిలుపు
- అవినీతి కాంగ్రెస్ ప్రభుత్వాన్ని గద్దె దించుతామని వ్యాఖ్య
- రాష్ట్ర సమగ్రాభివృద్ధికి డబుల్ ఇంజన్ సర్కార్ అవసరమని స్పష్టం



# మేం సిద్ధం.. మీరు సిద్ధమా?

- ప్రజలకు ఎవరేం చేశారో తేల్చుకుందాం
- బీఆర్ఎస్, బీజేపీలకు సీఎం రేవంత్‌రెడ్డి సవాల్
- అసెంబ్లీ ప్రత్యేక సమావేశాలు నిర్వహిద్దాం
- మా పాలన, బీఆర్ఎస్ పాలన,దేశంలో బీజేపీ పాలనపై చర్చిద్దాం
- మేం సంక్షేమ కార్యక్రమాలు అమలు చేస్తుంటే తప్పుడు ప్రచారం చేస్తున్నారు
- అభివృద్ధే ధ్యేయంగా పనిచేస్తాం
- ప్రజలు తమకు అండగా నిలవాలన్న సీఎం

రాష్ట్రంలో రెండున్నరేళ్ల కాంగ్రెస్ పాలన, పదేళ్ల బీఆర్ఎస్ పాలన, దేశంలో 12 ఏళ్ల బీజేపీ పాలన, మేనిఫెస్టోలపై చర్చించేందుకు తాము సిద్ధమని సీఎం రేవంత్‌రెడ్డి చెప్పారు. తెలంగాణ ఉద్యమం, ఆత్మ బలిదానాలపై కూడా చర్చిద్దామని, ప్రజలకు ఎవరేం చేశారో తేల్చుకుందామని అన్నారు. 'మీరు స్పీకర్‌కు లేఖ రాయండి.. అసెంబ్లీ, మండలి ప్రత్యేక సమావేశాలు నిర్వహిద్దాం. ఎన్ని రోజులైనా చర్చిద్దాం.. ఇందుకు మీరు సిద్ధమా..' అని సవాల్ విసిరారు. రాష్ట్రవ్యాప్తంగా రూ.13 వేల కోట్లతో నిర్మించనున్న హ్యామ్ రోడ్లకు నల్లగొండ జిల్లా కనగల్ మండల కేంద్రంలో ఆదివారం ఆయన శంకుస్థాపన చేశారు. అక్కడి వ్యవసాయ మార్కెట్‌లో ఏర్పాటు చేసిన హ్యామ్ రోడ్ల పైలాన్‌ను డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రులు కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, ఎన్.ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, ఇతర మంత్రులు, ప్రజాప్రతినిధులతో కలిసి ఆవిష్కరించారు. అనంతరం నల్లగొండ పట్టణంలోని ఎన్‌జీ కళాశాల మైదానంలో నిర్వహించిన బహిరంగ సభలో ముఖ్యమంత్రి ప్రసంగించారు.

## ఏపీ డిజిటల్ భవిష్యత్తుపై చంద్రబాబు ఫోకస్.

- చంద్రబాబుతో భారతీ ఎంటర్‌ప్రైజెస్ చైర్మన్ సునీల్ మిట్టల్ భేటీ
- రాష్ట్రంలో డిజిటల్ మౌలిక సదుపాయాలపై కీలక చర్చలు
- డేటా సెంటర్లు, కనెక్టివిటీ, అండర్ సీ కేబుల్‌పై ప్రధానంగా దృష్టి
- చర్చలు ఫలప్రదంగా సాగాయన్న ముఖ్యమంత్రి చంద్రబాబు

ఆంధ్రప్రదేశ్‌లో డిజిటల్ మౌలిక సదుపాయాలను బలోపేతం చేసే దిశగా ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు కీలక సమావేశం నిర్వహించారు. ప్రముఖ టెలికాం దిగ్గజం భారతీ ఎంటర్‌ప్రైజెస్ వ్యవస్థాపక చైర్మన్ సునీల్ భారతీ మిట్టల్‌తో ఆయన భేటీ అయ్యారు. రాష్ట్ర ప్రజలకు మెరుగైన కనెక్టివిటీని అందించడం, డిజిటల్ రంగంలో పెట్టుబడులను ఆకర్షించడమే లక్ష్యంగా ఈ చర్చలు సాగాయి. ఉండవల్లిలోని ముఖ్యమంత్రి నివాసంలో ఈ సమావేశం జరిగింది.



## మిస్టర్ రేవంత్.. రోజులు లెక్కపెట్టుకో

- నా ఎత్తు, పొడవుతో నీకేం పని?
- దమ్ముంటే ప్రజాక్షేత్రంలోకి రా.. తేల్చుకుందాం
- సింగరేణి టెండర్ బాగోతాలపై చర్చకు సిద్ధమా?
- నల్లగొండ సభలో సీఎం రేవంత్‌వి అన్ని అబద్ధాలే: హరీశ్‌రావు ఫైర్



2లో



## హిందూ మహాసముద్రం అవకాశాల సంద్రం

- భారత్, సీషెల్స్‌ల ఉమ్మడి ఇల్లు ఈ సముద్రమే
- ఇరుదేశాల ద్వైపాక్షిక సంబంధాలకు సముద్ర భద్రతే కేంద్రం
- ప్రధాని నరేంద్ర మోదీ వ్యాఖ్య
- సీషెల్స్ అధ్యక్షుడు ప్యాట్రిక్ హెర్మినీతో చర్చలు

విక్టోరియా: భాగస్వామ్యం అనేది దేశ పరిమాణంపై కాకుండా పరస్పర గౌరవం, విశ్వాసంపై ఆధారపడి ఉండాలని భారత ప్రధాని మోదీ తేల్చిచెప్పారు. ఆర్థిక శ్రేయస్సుతో పాటు సముద్ర భద్రత కూడిన సుసంపన్న హిందూ మహాసముద్రాన్ని భారతదేశం ఆకాంక్షిస్తోందని అన్నారు. భారత్, సీషెల్స్ దేశాల రక్షణ, భద్రతలు ఒకదానికొకటి విడదీయరానివని స్పష్టంచేశారు. హిందూ మహాసముద్రాన్ని అవకాశాల సముద్రంగా మార్చడమే తమ ధ్యేయమని ఉద్ఘాటించారు. ప్రధాని మోదీ ఆదివారం సీషెల్స్‌లోని విక్టోరియా నగరంలో సీషెల్స్ అధ్యక్షుడు ప్యాట్రిక్ హెర్మినీతో సమావేశమయ్యారు. ప్రతినిధుల స్థాయి చర్చలు జరిపారు. ఇరుదేశాల మధ్య ద్వైపాక్షిక సహకారంపై విస్తృతంగా చర్చించారు. ఉమ్మడి ప్రయోజనాలతో ముడిపడి ఉన్న ప్రాంతీయ, అంతర్జాతీయ పరిణామాలపై అభిప్రాయాలు పంచుకున్నారు. హెర్మినీతో భేటీ అనంతరం మోదీ మాట్లాడారు. హిందూ మహాసముద్రం మన ఉమ్మడి ఇల్లు అని విశ్వసిస్తున్నట్లు చెప్పారు.

## పేద పిల్లలకు మంచి భోజనం పెడుతుంటే ఏడుపా?..

- స్మార్ట్ కిచెన్లపై జగన్ ఆరోపణలను ఖండించిన మంత్రి లోకేశ్
- ఉన్నవారి ఉపాధికి ధోకా లేకుండానే అదనపు ఉద్యోగాలు కల్పిస్తున్నామని వెల్లడి
- కుక్-కమ్-హెల్పర్ల వేతన బకాయిల ఆరోపణలు పూర్తిగా అవాస్తవమని స్పష్టీకరణ
- పేద విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించడమే లక్ష్యమని వివరణ
- పేదల సంక్షేమాన్ని చూసి జగన్ ఓర్వలేకపోతున్నారని విమర్శ

ప్రభుత్వ పాఠశాలల్లో ఏర్పాటు చేస్తున్న స్మార్ట్ కిచెన్ల వ్యవహారంపై ప్రతిపక్ష నేత వైఎస్ జగన్మోహన్ రెడ్డి చేస్తున్న ఆరోపణలపై రాష్ట్ర విద్యా, ఐటీ శాఖల మంత్రి నారా లోకేశ్ తీవ్రంగా స్పందించారు. స్మార్ట్ కిచెన్ల ద్వారా ఎవరి ఉపాధి పోదని, పైగా కొత్త ఉద్యోగాలు వస్తాయని స్పష్టం చేశారు. పేద విద్యార్థులకు రుచి, శుచితో కూడిన నాణ్యమైన భోజనం అందిస్తుంటే జగన్ ఓర్వలేకపోతున్నారని ఆయన విమర్శించారు.



## ద్రోణి ప్రభావంతో పలుచోట్ల వర్షాలు

**మరో రెండు రోజులు మోస్తరు నుంచి భారీ వర్షాలు వాతావరణ శాఖ వెల్లడి**

అమరావతి: ద్రోణి ప్రభావంతో రాష్ట్రంలో పలుచోట్ల భారీ వర్షాలు కురుస్తున్నాయి. ఉత్తరాంధ్ర తీరప్రాంతం నుంచి ఛత్తీస్‌గఢ్ మీదుగా మహారాష్ట్ర వరకు ఈ ద్రోణి విస్తరించి ఉన్నట్లు వాతావరణ శాఖ తెలిపింది. కర్ణాటక నుంచి రాయలసీమ, తమిళనాడు మీదుగా కొమోరిన్ ప్రాంతం వరకు మరో ద్రోణి విస్తరించి ఉన్నట్లు పేర్కొంది. వీటి ప్రభావంతో ఆదివారం గుంటూరు జిల్లా మంగళగిరి సమీపంలోని ఎస్ఆర్ఎం యూనివర్సిటీ ప్రాంతంలో 6.8 సెంటీ మీటర్ల వర్షం కురిసింది. విజయనగరం జిల్లా రాజాంలో 5.2, గుంటూరు జిల్లా కాకుమానులో 5.1, తాడేపల్లిలో 4.5, ఎన్టీఆర్ జిల్లా కవులూరులో 4.1, బాపట్ల జిల్లా భట్టిప్రోలులో 3.9 సెంటీ మీటర్ల చొప్పున వర్షపాతం నమోదైంది. మరో రెండు రోజులు మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని, ఈదురుగాలులు వీచే అవకాశం ఉందని వాతావరణ శాఖ తెలిపింది.



## ఏపీ డిజిటల్ భవిష్యత్తుపై చంద్రబాబు ఫోకస్..

ఈ భేటీలో పలు కీలక అంశాలపై సుదీర్ఘంగా చర్చించారు. సునీల్ మిట్టల్‌తో జరిగిన చర్చలు అత్యంత ఫలప్రదంగా సాగాయని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సామాజిక మాధ్యమం 'ఎక్స్' (ట్విట్టర్) వేదికగా వెల్లడించారు. "ఆంధ్రప్రదేశ్ డిజిటల్ మౌలిక సదుపాయాల బలోపేతం, పౌరులకు మెరుగైన కనెక్టివిటీని అందించడంపై నిర్మాణాత్మక చర్చలు జరిగాయి" అని ఆయన తన పోస్టులో పేర్కొన్నారు. మరోవైపు, విశాఖపట్నంలో ఏర్పాటు చేస్తున్న గూగుల్ ఏఐ డేటా సెంటర్ ప్రాజెక్టులో భారతీ ఎంటర్‌ప్రైజెస్‌కు చెందిన ఎయిర్‌టెల్ నెక్స్‌ట్రా ఇప్పటికే భాగస్వామిగా ఉంది. భారీ పెట్టుబడులతో, స్వచ్ఛ ఇంధనంతో నడిచేలా రూపొందిస్తున్న ఈ ప్రాజెక్టుకు సంబంధించి 2026 ఏప్రిల్‌లో శంకుస్థాపన చేసేలా ప్రణాళికలు సిద్ధమయ్యాయి. ఈ ప్రాజెక్టును 2028 సెప్టెంబర్ నాటికి పూర్తి చేయాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఇదివరకే భాగస్వామ్య సంస్థలను కోరారు.

## మిస్టర్ రేవంత్.. రోజులు లెక్కపెట్టుకో

సిద్దిపేటజోన్: 'ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి బీఆర్ఎస్ అంటే భయం పట్టుకుంది. నిద్రలో కూడా వణుకు మొదలైంది. ఆయన చెప్పకనే చెబుతున్నారు. మళ్లీ బీఆర్ఎస్ అధికారంలోకి రాబోతుంది. ఆయన తప్పులు చేశారు. ప్రజలంతా బీఆర్ఎస్ వైపు చూస్తున్నారు అని అర్థమైంది. అందుకే ఇష్టానుసారంగా మాట్లాడుతున్నారు. మిస్టర్ రేవంత్‌రెడ్డి.. రోజులు లెక్కపెట్టుకో..ప్రజలు తగిన గుణపాఠం చెబుతారు'అని మాజీమంత్రి హరీశ్‌రావు ఘాటుగా స్పందించారు. నల్లగొండ పర్యటనలో సీఎం రేవంత్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలపై ఆదివారం సిద్ధిపేటజిల్లా కేంద్రంలో బూత్ లెవల్ ఏజెంట్ల సమావేశంలో హరీశ్‌రావు స్పందించారు. కర్ణాటకలో ముగ్గురు ముఖ్యమంత్రుల సమావేశ మతలబు గురించి అడిగితే దానికి బదులు ఇవ్వకుండా, సీఎం రేవంత్‌రెడ్డి నల్లగొండ సభలో నా పొడవు, ఎత్తు గురించి మాట్లాడి తప్పించుకోవాలని చూస్తున్నాడని విమర్శించారు. తెలంగాణ నీటి హక్కులు ముంచి ముంపుమేస్త్రీగా మారొద్దని ప్రశ్నిస్తే బదులు లేదని విమర్శించారు. రేవంత్‌రెడ్డి మనస్సు, ఆలోచన, బుద్ధి అంతా పొట్టిదేనని ఎద్దేవా చేశారు. 2034 వరకు అధికారంలోనే ఉంటామని మాట్లాడిన రేవంత్‌రెడ్డికి నిజంగా నమ్మకం ఉంటే అసెంబ్లీ రద్దు చేయాలని, ప్రజా క్షేత్రంలో తేల్చుకుందామని సవాల్ విసిరారు. లేకుంటే పార్టీ మారిన బీఆర్ఎస్ ఎమ్మెల్యేలతో రాజీనామా చేయించి ప్రజల్లోకి పోదామని, దమ్మూధైర్యం ఉంటే తన సవాల్ స్వీకరించాలన్నారు. రైతుభరోసా ద్వారా రైతుల కళ్లల్లో ఆనందం చూస్తున్నా అని అంటున్న సీఎం వ్యాఖ్యలు హాస్యాస్పదంగా ఉన్నాయన్నారు. రైతు భరోసా, రైతుబీమాలపై అసెంబ్లీలో చర్చకు సిద్ధమా అని సవాల్ విసిరారు. రైతుల కళ్లల్లో కన్నీళ్లు వచ్చేలా చేసిన సీఎం రేవంత్‌రెడ్డి ముందు తెలంగాణ రైతులకు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. ఎస్ఎల్‌బీ ప్రాజెక్టు విషయంలో కాంగ్రెస్ ప్రభుత్వం రెండున్నర ఏళ్లలో 12 మీటర్లు కూడా తవ్వలేదని, అన్యాయంగా ఎనిమిది మంది అమాయక కార్మికులు చనిపోతే వారి శవాలను కూడా తీయలేని అసమర్థ ప్రభుత్వం అని విమర్శించారు. సింగరేణి అవినీతి బహిర్గతం చేస్తే అసలు టెండర్లు కాలేదని సీఎం చెప్పడం విడ్డూరంగా ఉందన్నారు. సృజన్‌రెడ్డికి టెండర్లు దక్కింది రుజువు చేయడానికి తాము సిద్ధంగా ఉన్నామని, దమ్ముంటే అసెంబ్లీలో చర్చ పెట్టాలని సవాల్ విసిరారు. కాళేశ్వరం కూలింది అని ఆరోపణలు చేసిన సీఎం ఇప్పుడు హైదరాబాద్ తాగునీరు, మూసీకి ఎక్కడి నీళ్లు తరలిస్తున్నారని ప్రశ్నించారు. తెలంగాణ ఉద్యమంలో తన పాత్రపై సీఎం వ్యాఖ్యలు చేయడం విడ్డూరంగా ఉందన్నారు. ఉద్యమ సమయంలో హైదరాబాద్ నుంచి కరీంనగర్ వరకు వెళ్తూ తుపాకీ గురి పెట్టిన రేవంత్‌రెడ్డి చరిత్ర అందరికీ తెలిసిందేనన్నారు. తెలంగాణ ఉద్యమం, త్యాగం గురించి రేవంత్‌రెడ్డి మాట్లాడితే తెలంగాణ ప్రజలు నవ్వుకుంటారని చెప్పారు.

## పేద పిల్లలకు మంచి భోజనం పెడుతుంటే ఏడుపా?..

ఉపాధి కల్పనపై మాట్లాడుతూ.. "వైఎస్సార్ కడప జిల్లాలో పైలట్ ప్రాజెక్టుగా ఐదు స్మార్ట్ కిచెన్లు ప్రారంభించాం. వాటి పరిధిలోని 233 మంది కుక్-కమ్-హెల్పర్లు యథావిధిగా తమ విధుల్లో కొనసాగుతున్నారు. త్వరలో జిల్లాలో ఏర్పాటు చేయబోయే మరో 33 స్మార్ట్ కిచెన్ల వల్ల కూడా ఏ ఒక్కరి ఉపాధికీ నష్టం వాటిల్లదు. పైగా, ఈ కిచెన్ల నిర్వహణ ద్వారా స్వయంశక్తి సంఘాల మహిళలకు అదనంగా 38 మంది హెడ్ కుక్స్, 22 మంది అసిస్టెంట్ కుక్స్, 256 మంది హెల్పర్లు, సుమారు 76 మంది డ్రైవర్లకు ఉపాధి లభించబోతోంది. రాష్ట్రవ్యాప్తంగా వేలాది మందికి అదనపు ఉపాధి కల్పిస్తుంటే జగన్ ఎందుకు ఏడుస్తున్నారు? పేదలు బాగుపడటం ఆయనకు ఇష్టం లేదా?" అని లోకేశ్ ప్రశ్నించారు. వేతనాల బకాయిల ఆరోపణలను కూడా లోకేశ్ తోసిపుచ్చారు. "కడప జిల్లాలోని 3,450 మంది కుక్-కమ్-హెల్పర్లకు 2026 ఏప్రిల్ నెల వరకు జీతాలు పూర్తిగా చెల్లించాం. మే నెలలో పాఠశాలలకు వేసవి సెలవులు కావడంతో గౌరవ వేతనం చెల్లింపు ఉండదు. జూన్ నెల ఇంకా పూర్తి కాలేదు. మరి జగన్ ఎవరి బకాయిల గురించి ఫేక్ ఆరోపణలు చేశారో చెప్పాలి" అని ఆయన డిమాండ్ చేశారు.

## అది ప్రభుత్వమా, గూండాల రాజ్యమా?

రాష్ట్రంలో ప్రభుత్వం నడుపుతున్నారా లేక గూండాల రాజ్యాన్ని కొనసాగిస్తున్నారా? అంటూ ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడిపై వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. అమరావతిలో పర్యటిస్తున్న వైసీపీ మాజీ మంత్రులు, ఎమ్మెల్సీలపై జరిగిన దాడిని ఆయన తీవ్రంగా ఖండించారు. ఈ దాడులను చంద్రబాబే స్వయంగా ఉసిగొల్పారని ఆరోపిస్తూ 'ఎక్స్' (ట్విట్టర్) వేదికగా ఆయన వరుస పోస్టులు చేశారు. రాజధాని ప్రాంత రైతుల ఆహ్వానం మేరకు సీఆర్డీయే పరిరక్షణ కమిటీతో కలిసి వెళ్తున్న తమ పార్టీ నేతలపై దాడి చేయించడం ద్వారా పట్టపగలే ప్రజాస్వామ్యాన్ని హననం చేశారని జగన్ మండిపడ్డారు. కొందరు పోలీసు అధికారులు దగ్గరుండి ఈ దాడిని సమన్వయం చేయడం అత్యంత దారుణమని విమర్శించారు. అమరావతి పేరుతో జరుగుతున్న అవినీతి, రైతులపై సాగుతున్న దౌర్జన్యాలు బయటపడకుండా ఉండేందుకే ఇటువంటి దాడులకు పాల్పడుతున్నారని ఆరోపించారు. భూములు ఇవ్వని రైతులను భూసేకరణ నోటీసులతో వేధించడం, వారి పొలాలకు వెళ్లే మార్గాలను ధ్వంసం చేయడం, అక్రమంగా మట్టి తవ్వకాలు జరపడం వంటి దారుణాలకు ప్రభుత్వం ఒడిగడుతోందని జగన్ ఆరోపించారు. కొండవీటి వాగు నీటిని బలవంతంగా పొలాల్లోకి మళ్లించి, రైతులను తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. 'నేడు మీరు మొదలుపెట్టిన ఈ దుష్ట సంప్రదాయానికి, భవిష్యత్తులో రెట్టింపు స్పందన ఉంటుంది. ప్రజలు మిమ్మల్ని ఎన్నటికీ క్షమించరు," అని చంద్రబాబును హెచ్చరించారు.

# హిందూ మహాసముద్రం అవకాశాల సంద్రం

సముద్ర భద్రత, సుస్థిరత, శ్రేయస్సు మన ఉమ్మడి బాధ్యత అని పేర్కొన్నారు. భారతదేశపు మహాసాగర్ (ప్రాంతాలవ్యాప్తంగా భద్రత, వృద్ధి కోసం పరస్పర మరియు సంపూర్ణ పురోగతి) దార్శనికతకు ఇదే మూలమని తెలిపారు.



### వృద్ధి కోసం నూతన అవకాశాల అన్వేషణ

భారత్, సీషెల్స్ మధ్య ద్వైపాక్షిక ఆర్థిక సహకారాన్ని మరింత పటిష్టంగా తీర్చిదిద్దడంపై చర్చించినట్లు ప్రధానమంత్రి వెల్లడించారు. పరిశ్రమలు, అనుసంధానం, టెక్నాలజీ, డిజిటల్ మౌలిక సదుపాయాలు సహా ఇతర రంగాల్లో వృద్ధి కోసం రెండు దేశాలు నూతన అవకాశాలను అన్వేషిస్తాయని చెప్పారు.

### వాతావరణ మార్పులపై పోరాడుదాం

తర్వాత సీషెల్స్ నేషనల్ అసెంబ్లీలో మోదీ మాట్లాడారు. వాతావరణ మార్పుల వల్ల గ్లోబల్ సౌత్ దేశాలు.. ముఖ్యంగా ద్వీప దేశాలు ఎక్కువగా ప్రభావితమవుతున్నాయని ప్రధాని మోదీ ఆందోళన వ్యక్తంచేశారు. వాతావరణ మార్పుల ప్రభావాలు ఇప్పటికే తీరప్రాంతాలు, సముద్ర జీవావరణ వ్యవస్థలు, వాతావరణ సరళి, సమాజాలపై కనిపిస్తున్నాయని చెప్పారు. ఆయన ఆదివారం సీషెల్స్ జాతీయ అసెంబ్లీలో ప్రసంగించారు. వాతావరణ మార్పులకు అతి తక్కువగా కారణమైవారు దాని పర్యవసానాల అత్యధిక భారాన్ని మోయకూడదని స్పష్టంచేశారు. వాతావరణ మార్పుల నియంత్రణకు ప్రపంచ దేశాలు కలిసికట్టుగా కృషి చేయాలని పిలుపునిచ్చారు. మరింత సమ్మిళిత ప్రపంచం, సమకాలీన వాస్తవాలను ప్రతిబింబించే అంతర్జాతీయ సంస్థల పట్ల భారత్, సీషెల్స్ ఒకే దృక్పథాన్ని పంచుకుంటున్నాయని గుర్తుచేశారు. గ్లోబల్ సౌత్ ప్రయోజనాలను ముందుకు తీసుకెళ్లడానికి నిబద్ధతను చాటుతున్నాయని పేర్కొన్నారు.

### 19 కీలక అంశాలపై నిర్ణయం

రక్షణ, సముద్ర భద్రత, డిజిటల్ చెల్లింపులు, అంతరిక్షం, ఆరోగ్య సంరక్షణ, వ్యవసాయం, విద్య వంటి పలు రంగాల్లో పరస్పర సహకారాన్ని మరింత పటిష్టం చేసుకోవాలని భారత్, సీషెల్స్ తీర్మానించుకున్నాయి. భారత ప్రధాని మోదీ, సీషెల్స్ అధ్యక్షుడు హెర్మినీ మధ్య ఆదివారం జరిగిన చర్చల్లో 19 అంశాలపై నిర్ణయానికి వచ్చారు. ఇందులో నేరస్తుల అప్పగింత ఒప్పందం, బాహ్య అంతరిక్షాన్ని శాంతియుత ప్రయోజనాల కోసం ఉపయోగించుకోవడంలో సహకార ఒప్పందం, సీషెల్స్‌లో యూపీఐ ఆధారిత డిజిటల్ చెల్లింపులను ప్రోత్సహించే ఒప్పందం, ఎక్స్‌పోర్ట్--ఇంపోర్ట్ బ్యాంక్ ఆఫ్ ఇండియాతో సమగ్ర రుణ ఒప్పందం, నూతన సీషెల్స్ జాతీయ ఆసుపత్రికి సహకార ఒప్పందం ఉన్నాయి. సీషెల్స్‌కు ఒక వేగవంతమైన గస్తీ నౌకను బహుమతిగా ఇవ్వడం, రక్షణ దళానికి 10 యుటిలిటీ వాహనాలు, ఐదు లేజర్ రేడియల్ తరగతి పడవలను అప్పగించడం, తీర రక్షక దళం బలోపేతానికి సహకరించడం, గ్లాస్ కాక్‌పిట్‌తో ఒక డోర్నియర్ విమానాన్ని ఉన్నతీకరించడం వంటి అంశాలను ఇరు పక్షాలు ప్రకటించాయి. దౌత్య శిక్షణ కోసం సుష్మా స్వరాజ్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఫారిన్ సర?వస్, సీషెల్స్ విదేశీ వ్యవహారాల శాఖ మధ్య ఒప్పందం కుదిరింది.

### మోదీకి సీషెల్స్ గౌరవ పురస్కారం ప్రదానం

ప్రధాని మోదీకి సీషెల్స్ ప్రభుత్వం 'గార్డియన్ ఆఫ్ ది బ్లూ హొరైజన్'అనే గౌరవ పురస్కారాన్ని ప్రదానం చేసింది. సీషెల్స్ అధ్యక్షుడు హెర్మినీ ఆయనను ఈ పురస్కారంతో సత్కరించారు. పర్యావరణ పరిరక్షణ పట్ల మోదీ చూపుతున్న నిబద్ధత, చిన్న ద్వీప దేశాల ఆకాంక్షలను ముందుకు తీసుకెళ్లడంలో ఆయన చేస్తున్న కృషికి ఈ గౌరవాన్ని అందించారు. వాతావరణ మార్పులు విసురుతున్న సవాళ్లతో పోరాడుతున్న దేశాలకు, పర్యావరణ పరిరక్షణను భవిష్యత్ తరాల పట్ల తమ బాధ్యతగా భావిస్తున్న దేశాలకు అవార్డ్‌ను అంకితం చేస్తున్నట్లు మోదీ ప్రకటించారు.

# మన కథ ముగిసె...

లండన్: టి20 ప్రపంచకప్‌లో సెమీఫైనల్‌కు చేరాలంటే తప్పక గెలవాల్సిన మ్యాచ్‌లో భారత జట్టు తడబడింది. మొదట బ్యాటింగ్‌లో మంచి స్కోరు చేసినా... దాన్ని కాపాడుకోవడంలో విఫలమై వరల్డ్‌కప్ నుంచి ని?ష్క్రమించింది. గ్రూప్--1లో భాగంగా ఆదివారం జరిగిన మ్యాచ్‌లో హర్మన్‌ప్రీత్ కౌర్ సారథ్యంలోని టీమిండియా 6 వికెట్ల తేడాతో మాజీ చాంపియన్ ఆస్ట్రేలియా చేతిలో ఓడింది. గ్రూప్ దశలో ఐదు మ్యాచ్‌ల్లో మూడు విజయాలు, రెండు పరాజయాలతో 6 పాయింట్లకే పరిమితమైన భారత్... గ్రూప్‌లో మూడో స్థానాన్ని దక్కించుకుంది. ఐదు మ్యాచ్‌ల్లోనూ గెలిచిన ఆస్ట్రేలియా (10 పాయింట్లు), నాలుగింట గెలిచిన దక్షిణాఫ్రికా (8 పాయింట్లు) సెమీఫైనల్‌కు అర్హత సాధించాయి. కీలక పోరులో టాస్ గెలిచి మొదట బ్యాటింగ్ ఎంచుకున్న టీమిండియా 20 ఓవర్లలో 4 వికెట్ల నష్టానికి 170 పరుగులు చేసింది. టి20 ప్రపంచకప్‌లో ఆస్ట్రేలియాపై ఏ జట్టుకైనా ఇదే అత్యధిక స్కోరు. కెప్ట?టన్ హర్మన్‌ప్రీత్ కౌర్ (27 బంతుల్లో 56; 6 ఫోర్లు, 3 సిక్స్‌లు) మెరుపు అర్ధశతకంతో చెలరేగగా... స్మృతి మంధాన (37 బంతుల్లో 38; 6 ఫోర్లు), షఫాలీ వర్మ (26 బంతుల్లో 34; 3 ఫోర్లు, 2 సిక్స్‌లు), జెమీమా రోడ్రిగ్స్ (28 బంతుల్లో 34; 1 ఫోర్, 1 సిక్స్) రాణించారు. అనంతరం లక్ష్యఛేదనలో ఆస్ట్రేలియా 19 ఓవర్లలో 4 వికెట్లకు 172 పరుగులు చేసింది. 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' ఎలీస్ పెర్రీ (38 బంతుల్లో 56; 8 ఫోర్లు), ఆష్లే గార్డ్‌నర్ (29 బంతుల్లో 53 నాటౌట్; 3 ఫోర్లు, 3 సిక్స్‌లు) అర్ధశతకాలతో జట్టును గెలిపించారు. భారత బౌలర్లలో ఆంధ్రప్రదేశ్ అమ్మాయి శ్రీచరణి 2 వికెట్లు పడగొట్టింది. ఆదివారమే జరిగిన మరో మ్యాచ్‌లో దక్షిణాఫ్రికా 4 వికెట్ల తేడాతో బంగ్లాదేశ్‌పై విజయం సాధించింది. మంగళవారం జరిగే తొలి సెమీఫైనల్లో వెస్టిండీస్‌తో ఆస్ట్రేలియా; గురువారం జరిగే రెండో సెమీఫైనల్లో దక్షిణాఫ్రికాతో ఇంగ్లండ్ తలపడతాయి. ఓపెనర్లు మెరుగైన ఆటతీరు కనబర్చడంతో... టీమిండియాకు శుభారంభం దక్కింది. స్మృతి, షఫాలీ తొలి వికెట్‌కు 66 పరుగులు జోడించారు. షఫాలీ అవుటైన కాసేపటికే లేని పరుగు కోసం ప్రయత్నించి స్మృతి రనౌట్ అయింది. జెమీమా ఆశించినంత వేగంగా ఆడలేకపోవడంతో... 18 ఓవర్లు ముగిసేసరికి టీమిండియా 134/2తో నిలిచింది. అయితే ఆఖర్లో హర్మన్ దంచికొట్టడంతో జట్టు మంచి స్కోరు చేయగలిగింది. హర్మన్ 19వ ఓవర్‌లో ఓ ఫోర్ కొట్టగా... జెమీమా సిక్స్ బాదింది. దీంతో 13 పరుగులు రాగా... ఆసీస్ సారథి మొలినెక్స్ వేసిన ఆఖరి ఓవర్‌లో హర్మన్ 'హ్యాట్రిక్' సిక్స్‌లతో స్టేడియాన్ని హోరెత్తించింది.

# తెలంగాణలో త్వరలో కమలం వికసిస్తుంది



తెలంగాణలో త్వరలోనే భారతీయ జనతా పార్టీ (బీజేపీ) అధికారంలోకి వస్తుందని, రాష్ట్రంలో కమలం వికసించడం ఖాయమని ఆ పార్టీ జాతీయ అధ్యక్షుడు నితిన్ నబిన్ ధీమా వ్యక్తం చేశారు. నిర్దేశిత లక్ష్యాన్ని చేరుకునేందుకు క్షేత్రస్థాయిలో పార్టీ శ్రేణులు మరింత పట్టుదలతో శ్రమించాలని ఆయన పిలుపునిచ్చారు. ఆదివారం హైదరాబాద్ పర్యటనలో భాగంగా ఆయన శంషాబాద్‌లో రంగారెడ్డి రూరల్ జిల్లా పార్టీ కార్యాలయాన్ని ప్రారంభించారు. దీనితో పాటు మరో తొమ్మిది జిల్లాల కార్యాలయాలను వర్చువల్ విధానంలో ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గతంలో పశ్చిమ బెంగాల్‌లో పార్టీ కనబరిచిన పోరాట పటిమను తెలంగాణలోనూ పునరావృతం చేయాలని సూచించారు. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం అవినీతి, అరాచక పాలన సాగిస్తోందని నితిన్ నబిన్ ఆరోపించారు. ప్రజా వ్యతిరేక విధానాలను అవలంబిస్తున్న ఈ ప్రభుత్వాన్ని గద్దె దించేందుకు కార్యకర్తలు వీధుల్లోకి వచ్చి పోరాడాలని పిలుపునిచ్చారు. గతంలో బీఆర్ఎస్ ప్రభుత్వాన్ని ఓడించడంలో బీజేపీ కీలక పాత్ర పోషించగా, ఆ ఫలితాన్ని కాంగ్రెస్ తనకనుకూలంగా మార్చుకుని లబ్ధి పొందిందని ఆయన వ్యాఖ్యానించారు. బూత్ స్థాయి నుంచి పార్టీని బలోపేతం చేయడంపై ప్రత్యేక దృష్టి సారించాలని, ప్రతి గల్లీ, మొహల్లాకు పార్టీ సిద్ధాంతాలను, ప్రధాని నరేంద్ర మోదీ అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను తీసుకెళ్లాలని ఆయన దిశానిర్దేశం చేశారు. కేంద్రంలోనూ, రాష్ట్రంలోనూ 'డబుల్ ఇంజిన్' సర్కారు ఉంటేనే తెలంగాణ సమగ్ర అభివృద్ధి సాధ్యమవుతుందని ఈ సందర్భంగా స్పష్టం చేశారు. అంతకుముందు, శంషాబాద్ విమానాశ్రయానికి చేరుకున్న నితిన్ నబిన్‌కు కేంద్ర మంత్రులు జి. కిషన్ రెడ్డి, బండి సంజయ్ కుమార్, రాష్ట్ర బీజేపీ నేత ఎన్. రాంచందర్ రావు తదితరులు ఘన స్వాగతం పలికారు.

# మేం సిద్ధం.. మీరు సిద్ధమా?

'మా ప్రజా ప్రభుత్వం పేదలకు రేషన్‌కార్డులు, సన్న బియ్యం, ఇందిరమ్మ ఇళ్లతో పాటు అనేక సంక్షేమ కార్యక్రమాలు అమలు చేస్తుంటే.. కాంగ్రెస్ రెండున్నరేళ్లలో ఏమీ చేయలేదని బీజేపీ, బీఆర్ఎస్ తప్పుడు ప్రచారం చేస్తున్నాయి. కేసీఆర్ శుక్రాచార్యుడిలా ఫామ్‌హౌస్‌లో ఉంటే కేటీఆర్, హరీశ్‌లు బిల్లారంగా తరహాలో తెలంగాణలో తిరుగుతూ తప్పుడు ప్రచారం చేస్తున్నారు. ప్రజా ప్రభుత్వం పోవాలని, బీఆర్ఎస్ ప్రభుత్వం రావాలని ప్రజలు కోరుకుంటున్నట్లు చెబుతున్నారు. వాస్తవానికి ప్రజలు అలా ఏమీ కోరుకోవడం లేదు. వారి కుటుంబం, వారికి సంబంధించిన వారే కోరుకుంటున్నారు. సింగరేణిలో టెండర్ ప్రక్రియ పూర్తి కాకముందే ఆరోపణలు చేశారు. వారు ఎన్ని నాటకాలు వేసినా తెలంగాణ ప్రజలు నమ్మరు. వారు సామాజికంగా బీఆర్ఎస్‌ను బహిష్కరించారు. 2034 వరకు మేమే అధికారంలో ఉంటాం. పదేళ్లు వెనక్కు తిరగకుండా అభివృద్ధే ధ్యేయంగా పనిచేస్తాం. మాకు ప్రజలు అండగా ఉండాలి..' అని సీఎం కోరారు. 'బీఆర్ఎస్ త్యాగాల పునాదులపై తెలంగాణ వచ్చిందన్నారు. మీవి త్యాగాలా? ఆ పేరుతో రాజీనామాలు చేసి ఎన్నికలు తెచ్చి కలెక్షన్లు చేశారు. మీరు చేసినవే త్యాగాలంటే.. కొండా లక్ష్మణ్ బాపూజీ, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి చేసిన త్యాగాలను ఏమనాలి? 1969 తొలి తెలంగాణ



ఉద్యమంలో కొండా లక్ష్మణ్ బాపూజీ మంత్రి పదవికి రాజీనామా చేసి మళ్లీ మంత్రి పదవి తీసుకోలేదు. మలి దశ ఉద్యమంలో మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి మంత్రి పదవి వదిలేసి, నల్లగొండ గడ్డపై తెలంగాణ కోసం ఆమరణ నిరాహార దీక్ష చేశారు. తెలంగాణ వచ్చాకే పదవి తీసుకుంటానని ప్రతినబూని వచ్చాకే మళ్లీ మంత్రి పదవి తీసుకున్నారు. రూ.100 పెట్రోలు తెచ్చుకుని 1 రూపాయి అగ్గిపెట్టె తెచ్చుకోలేని హరీశ్‌రావుది త్యాగమా? శ్రీకాంతచారి, కానిస్టేబుల్ కిష్టయ్య, యాదయ్యలది త్యాగమా? అగ్గిపెట్టె హరీశ్‌రావు ఆర్థిక మంత్రిగా, నీటిపారుదల శాఖ మంత్రిగా పని చేసినప్పుడు తెలంగాణ అప్పులు రూ.69 వేల కోట్లు ఉంటే బీఆర్ఎస్ పాలనలో రూ.8.11 లక్షల కోట్లకు పెంచారు. అలాంటి వారి దోపిడీని ప్రజలు ఇంకా సహించాలా? పదేళ్లలోనే వందేళ్ల విధ్వంసాన్ని సృష్టించిన మిమ్మల్ని ఏమనాలి?..' అని రేవంత్ ప్రశ్నించారు. 'రూ.16 వేల కోట్లు పెట్టి పేదలకు సన్న బియ్యం ఇస్తున్నాం. ఫామ్ హౌస్‌లో ఉండే కేసీఆర్ ఏం తింటున్నారో, తండాలో ఉండే గిరిజన బిడ్డలు కూడా ఆ సన్న బియ్యమే తింటున్నారు. బీఆర్ఎస్ నేతలకు డౌటు ఉంటే తండాలు, గూడేలకు వెళ్లి సన్న బియ్యం తింటున్నారో? లేదో? చూసి రావాలి. బీఆర్ఎస్ పదేళ్ల పాలనలో పేదలకు ఇళ్లు ఇవ్వలేదు. మేము రెండున్నరేళ్లలో 4.5 లక్షల ఇళ్లు కట్టిస్తుంటే బీఆర్ఎస్ నేతలకు కడుపు మండుతోంది. పేదవాళ్లకు ఇందిరమ్మ ఇళ్లు ఇస్తుంటే వందల ఎకరాల్లో ఫామ్‌హౌస్‌లు కట్టుకున్న వారికి కడుపుమంట ఎందుకు? తండ్రి, కొడుకు, అల్లుడికి ఫామ్ హౌస్‌లు, పదవులు తప్ప ప్రజల గురించి ఆలోచనే లేదు. పరీక్షలు పెట్టి పేపర్లు అమ్ముకుని వేల కోట్ల అక్రమాలకు పాల్పడ్డారు..' అని సీఎం దుయ్యబట్టారు.



## రాజాపేట మండలంలో పల్స్ పోలియో విజయవంతం

- చిన్నారులకు చుక్కలు వేసిన సిబ్బంది
- పోలియో రహిత సమాజానికి పునరంకితం కావాలి: ప్రజాప్రతినిధులు

**తొలివెలుగు, రాజాపేట:** మండల వ్యాప్తంగా ఆదివారం నిర్వహించిన పల్స్ పోలియో కార్యక్రమం విజయవంతమైంది. స్థానిక వైద్యాధికారి డాక్టర్ మోసెస్ రాజ్ పర్యవేక్షణలో ప్రాథమిక ఆరోగ్య కేంద్ర సిబ్బంది, ఆశా వర్కర్లు, అంగన్‌వాడీ కార్యకర్తలు ఉత్సాహంగా పాల్గొని ఐదేళ్లలోపు చిన్నారులకు పోలియో చుక్కలు వేశారు. ఆయా గ్రామాల్లో ప్రజాప్రతినిధులు, వివిధ పార్టీల నాయకులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు, జర్నలిస్టులు ఈ కార్యక్రమంలో భాగస్వామ్యులై పోలియో నిర్మూలనపై అవగాహన కల్పించారు. కాల్వపల్లి గ్రామంలో నిర్వహించిన పల్స్ పోలియో కేంద్రంలో ఐదేళ్లలోపు చిన్నారులకు చుక్కల మందు వేశారు. ఈ సందర్భంగా కాల్వపల్లి గ్రామ సర్పంచ్ ఇంజ లక్ష్మి, కాంగ్రెస్ పార్టీ జిల్లా కార్యదర్శి ఇంజ నరేష్, ఉప సర్పంచ్ కళ్లెం పాండులు మాట్లాడుతూ.. పోలియో రహిత సమాజ స్థాపన కోసం ప్రతి ఒక్కరూ బాధ్యతగా పనిచేయాలన్నారు. ఐదు సంవత్సరాల లోపు ఉన్న ప్రతి చిన్నారికి తప్పనిసరిగా పోలియో చుక్కలు వేయించాలని తల్లిదండ్రులకు సూచించారు. ఈ కార్యక్రమంలో ఆశా వర్కర్ ఇంజ రేణుక, వేల్పుల విజయ, అంగన్‌వాడీ కార్యకర్తలు, వార్డు సభ్యులు, యువకులు పాల్గొన్నారు.

## బసంతాపురంలో పల్స్ పోలియో విజయవంతం

- పోలియో రహిత సమాజాన్ని నిర్మిద్దాం: సర్పంచ్ మెండు రత్నమాల
- ఉత్సాహంగా తరలివచ్చిన తల్లిదండ్రులు



**తొలివెలుగు, రాజాపేట:** మండలం బసంతాపురం గ్రామంలో జాతీయ పోలియో నివారణ కార్యక్రమం ఆదివారం విజయవంతంగా జరిగింది. గ్రామంలోని పోలియో కేంద్రంలో ఐదేళ్లలోపు చిన్నారులకు చుక్కల మందు వేసే కార్యక్రమాన్ని గ్రామ సర్పంచ్ మెండు రత్నమాల సత్తిరెడ్డి పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ఆమె చిన్నారులకు పోలియో చుక్కలు వేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం సర్పంచ్ మాట్లాడుతూ.. భావితరాల ఆరోగ్య పరిరక్షణకు పోలియో చుక్కలు ఎంతో దోహదపడతాయని, ప్రతి ఒక్కరూ భాగస్వాములై పోలియో రహిత సమాజాన్ని నిర్మించాలని పిలుపునిచ్చారు. ఐదేళ్లలోపు చిన్నారులందరికీ తప్పనిసరిగా పోలియో చుక్కలు వేయించాలంటూ ప్రజాప్రతినిధులు గ్రామంలో అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ గుల్లపల్లి రాజుగౌడు, కోమటిరెడ్డి యువసేన రాష్ట్ర అధ్యక్షుడు మెండు భాస్కర్ రెడ్డి, వార్డు సభ్యులు ఉపేందర్ రెడ్డి, కవిత బాలకృష్ణ గౌడ్, ముల్కలపల్లి రమేష్, వడ్లకొండ రాములమ్మ, వడ్లకొండ మాధవి సురేష్ పాల్గొన్నారు. అలాగే మండల వైద్యాధికారి, వాలంటీర్ ముల్కలపల్లి సౌజన్య, అంగన్‌వాడీ టీచర్లు, వడ్లకొండ శివ, భీమగని భూదయ్య, గ్రామస్థులు పాల్గొని పోలియో చుక్కల కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

## సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి

- బసంతాపురం కాంగ్రెస్ అధ్యక్షుడిగా కట్కూరి వెంకటేష్ ఏకగ్రీవ ఎన్నిక
- ప్రభుత్వ విప్ బీర్ల ఎల్లయ్య నాయకత్వంలో పనిచేస్తానన్న నూతన అధ్యక్షుడు

**తొలివెలుగు, రాజాపేట:** రాజాపేట మండలం బసంతాపురం కాంగ్రెస్ పార్టీ గ్రామశాఖ నూతన కార్యవర్గాన్ని ఆదివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మాజీ అధ్యక్షుడు రాపాక తిరుపతి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ గ్రామ నూతన అధ్యక్షుడిగా కట్కూరి వెంకటేష్‌ను ఎంపిక చేశారు. అలాగే ఉపాధ్యక్షుడిగా ముల్కలపల్లి నర్సింహులు, ప్రధాన కార్యదర్శిగా మెండు ప్రభాకర్ రెడ్డి, కార్యదర్శిగా వడ్లకొండ సురేష్, కోశాధికారిగా పిల్లిట్ల మురారిలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు తిరుపతి పేర్కొన్నారు. ఈ నూతన కమిటీ వివరాలను మండల అధ్యక్షుడు నమిల మహేందర్ గౌడ్‌కు అందజేశారు. ఎన్నిక అనంతరం వెంకటేష్ మాట్లాడుతూ.. తనపై ఎంతో నమ్మకంతో పార్టీ బాధ్యతలు అప్పగించిన నాయకులకు ధన్యవాదాలు తెలిపారు. ప్రభుత్వ విప్, పార్టీ జిల్లా అధ్యక్షుడు బీర్ల ఎల్లయ్య సూచనలతో కాంగ్రెస్ బలోపేతానికి అహర్నిశలు శ్రమిస్తానన్నారు. ప్రభుత్వ పథకాలు ప్రతి గడపకూ చేరేలా, అర్హులకు న్యాయం జరిగేలా పనిచేస్తానని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా నూతన అధ్యక్షుడిని పలువురు పార్టీ శ్రేణులు, నాయకులు శాలువాలతో ఘనంగా సన్మానించారు.



# యాదగిరి కొండపై భక్తజన సంద్రం!



- సెలవు దినం కావడంతో పోటెత్తిన జనం
- స్వామివారి దర్శనానికి 5 గంటల సమయం
- దర్శించుకున్న 85 వేల మంది భక్తులు

**తొలివెలుగు, యాదగిరిగుట్ట:** శ్రీలక్ష్మీనరసింహస్వామి క్షేత్రం ఆదివారం భక్తజన సంద్రమైంది. సెలవు దినం కావడంతో స్వామి, అమ్మవార్లను దర్శించుకునేందుకు తెలుగు రాష్ట్రాల నలుమూలల నుంచి భక్తులు భారీ సంఖ్యలో తరలివచ్చారు. ఉదయం నుంచే కొండపైకి భక్తుల రాక అనూహ్యంగా పెరిగిందని ఆలయ అధికారులు వెల్లడించారు. ఈ క్షేత్ర చరిత్రలోనే అరుదైన రీతిలో ఒకేరోజు సుమారు 85 వేల మంది స్వామివారిని దర్శించుకున్నట్లు అధికారులు ప్రాథమికంగా అంచనా వేశారు.

**కిటకిటలాడిన క్యూలైన్లు..**

భక్తుల రద్దీ కారణంగా ఆలయ పరిసరాలు, గర్భాలయం, ప్రత్యేక దర్శన క్యూలైన్లు, ధర్మదర్శనం లైన్లు పూర్తిగా నిండిపోయాయి. ప్రసాద విక్రయశాలలు, అన్నదాన సత్రం, కొండ కింద ఉన్న విష్ణు పుష్కరిణి, సత్యనారాయణ వ్రత మండపాల వద్ద భక్తులు కిటకిటలాడారు. క్యూలైన్లలో ఉన్న భక్తులకు స్వామివారి దర్శనం భాగ్యం కలగడానికి సుమారు 5 గంటల సమయం పట్టిందని భక్తులు తెలిపారు.

**చల్లబడిన వాతావరణం.. మెట్ల మార్గాన పయనం:**

నైరుతి రుతుపవనాల ప్రభావంతో యాదగిరిగుట్ట పరిసర ప్రాంతాల్లో అక్కడక్కడా కురిసిన జల్లుల వల్ల వాతావరణం ఒక్కసారిగా చల్లబడింది. ఆహ్లాదకరమైన వాతావరణం నెలకొనడంతో మెట్ల మార్గం గుండా కాలినడకన కొండపైకి చేరుకునేందుకు భక్తులు మక్కువ చూపారు. విష్ణు పుష్కరిణిలో పుణ్యస్నానాలు ఆచరించి, తలనీలాలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు.

**వృద్ధులు, చిన్నారులకు ప్రత్యేక సౌకర్యాలు:**

భారీ రద్దీ దృష్ట్యా చిన్నారులు, వృద్ధులు, దివ్యాంగులు ఇబ్బంది పడకుండా ఆలయ అధికారులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. కొండపై ఉన్న బస్టాండ్ నుంచి స్వామివారి తూర్పు రాజగోపురం వరకు ఉచిత బ్యాటరీ వాహనాలను అందుబాటులో ఉంచారు. వీటి సహాయంతో వృద్ధులను సురక్షితంగా ఆలయ ప్రవేశ ద్వారం వద్దకు చేరవేశారు.









## మంద కృష్ణ మాదిగను కలిసిన ఇంజ మహేష్

- ఉద్యోగుల పదోన్నతులపై చర్చ - యాదాద్రి స్వామివారి ప్రసాదం అందజేత

**తొలివెలుగు, రాజాపేట:** రాజాపేట మండలం కాల్వపల్లి గ్రామానికి చెందిన మాదిగ ఎంప్లాయిస్ ఫెడరేషన్ (ఎమ్ఈఎఫ్) యాదాద్రి భువనగిరి జిల్లా అధ్యక్షుడు, దళిత రత్న, శ్రమశక్తి అవార్డుల గ్రహీత ఇంజ మహేష్ మాదిగ ఆదివారం హైదరాబాద్‌లో మహాజన నేత, పద్మశ్రీ మంద కృష్ణ మాదిగను మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. అంబర్‌పేటలోని మంద కృష్ణ నివాసానికి వెళ్లిన ఆయన, యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహస్వామి వారి పవిత్ర ప్రసాదాన్ని అందజేసి ఆశీస్సులు తీసుకున్నారు. ఈ సందర్భంగా యాదాద్రి భువనగిరి జిల్లాలో మాదిగ సామాజికవర్గానికి చెందిన ఉద్యోగుల ప్రమోషన్లు (పదోన్నతులు), ఎదుర్కొంటున్న పలు సమస్యల గురించి మంద కృష్ణతో మహేష్ మాదిగ సుదీర్ఘంగా చర్చించారు. ఈ కార్యక్రమంలో చింతిగారి యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

## పాముకుంట బడిలో.. జ్ఞాపకాల పందిరి!

- రెండు దశాబ్దాల తర్వాత ఒకే చోటుకు చేరిన స్నేహితులు
- గురువులకు ఘన సత్కారం.. బాల్య స్మృతుల నెమరువేత

**తొలివెలుగు, రాజాపేట:** రెండు దశాబ్దాల సుదీర్ఘ నిరీక్షణ.. కాలం మారినా చెదరని స్నేహం.. నాటి బాల్య స్మృతులను గుర్తుచేసుకుంటూ రాజాపేట మండలం పాముకుంట ప్రభుత్వ ఉన్నత పాఠశాల పూర్వ విద్యార్థులు ఆదివారం ఒకచోట చేరారు. పాఠశాలకు చెందిన 2005-2006 విద్యాసంవత్సరం పదో తరగతి (ఎస్సెస్సీ) బ్యాచ్ విద్యార్థుల ఆత్మీయ అపూర్వ సమ్మేళనం స్థానిక ఒక ఫంక్షన్ హాల్‌లో ఘనంగా నిర్వహించారు. 20 ఏళ్ల తర్వాత తోటి స్నేహితులంతా ఒకరినొకరు పలకరించుకుంటూ ఆనందోత్సాహాల మధ్య గడిపారు. ఈ సందర్భంగా తమకు విద్యాబుద్ధులు నేర్పిన గురువులను పూర్వ విద్యార్థులు ప్రత్యేకంగా ఆహ్వానించారు. వారి పాదాలకు నమస్కరించి ఆశీస్సులు తీసుకున్నారు. అనంతరం గురువులను శాలువాలు, పూలమాలలతో ఘనంగా సత్కరించి కృతజ్ఞతలు చాటుకున్నారు. చదువుకునే రోజుల్లో జరిగిన తీపి జ్ఞాపకాలను, ఉపాధ్యాయులు చెప్పిన హితబోధలను ఈ సందర్భంగా నెమరువేసుకున్నారు. అనంతరం అందరూ కలిసి సామూహిక విందు భోజనం చేసి, సాయంత్రం వరకు సరదాగా గడిపారు. తమకు చదువు నేర్పిన పాఠశాలను, జీవితంలో ఎదగడానికి తోడ్పడిన తోటి స్నేహితులను ఎప్పటికీ మరిచిపోలేమని ఈ సందర్భంగా వారు భావోద్వేగంగా పంచుకున్నారు.





## ఇంద్రపాలనగరంలో హమాలీలకు ఘన సన్మానం

- 1.40 లక్షల బస్తాల కొనుగోళ్లు విజయవంతం
- కాంగ్రెస్ జిల్లా నాయకులు పూస బాలకిషన్



**తొలివెలుగు, రామన్నపేట:** మండలంలోని ఇంద్రపాలనగరం గ్రామంలో ఐకేపీ, పీఏసీఎస్ వరి ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో సేవలందించిన హమాలీలను కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకులు పూస బాలకిషన్ ఘనంగా సన్మానించారు. నిధానపల్లిలోని డీఎస్సార్ ఫంక్షన్ హాల్‌లో ఆదివారం ఈ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ధాన్యం కొనుగోలు ప్రక్రియ విజయవంతం కావడంలో హమాలీల పాత్ర కీలకమన్నారు. గతంలో 20 నుంచి 30 మంది హమాలీలతో చేసే పనిని, ఈసారి కేవలం 14 మందితోనే సమర్థవంతంగా పూర్తిచేయడం విశేషమన్నారు. ఈ సీజన్‌లో రికార్డు స్థాయిలో సుమారు 1,40,000 బస్తాల ధాన్యాన్ని కొనుగోలు చేసినట్లు వెల్లడించారు. జిల్లా కలెక్టర్, సంబంధిత అధికారులతో నిరంతరం సమన్వయం చేసుకుంటూ రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూశామన్నారు. కొనుగోళ్లలో సహకరించిన లారీ డ్రైవర్లను సైతం శాలువాలతో సత్కరించారు. రైతుల సంక్షేమమే లక్ష్యంగా భవిష్యత్తులోనూ పనిచేస్తామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమం విజయవంతం కావడానికి సహకరించిన కంబాలపెల్లి సత్తయ్య, కప్పల రాజు, పాదం సత్యనారాయణ, వడ్లకొండ రాజమల్లు, సింగనబోయిన సత్యనారాయణ, సింగనబోయిన బాలరాజు, గర్దాస్ రాగాల్, బోదాస్ పెద్దిరాజు, నక్క ఐలేష్ తదితరులకు ఆయన ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

## పోలియో రహిత సమాజమే మన లక్ష్యం

- అశ్రద్ధ చేయకుండా చుక్కలు వేయించాలి
- పల్స్ పోలియో కార్యక్రమంలో సర్పంచ్ గర్దాస్ విక్రమ్



**తొలివెలుగు, రామన్నపేట:** పుట్టిన బిడ్డ నుంచి ఐదేళ్ల లోపు వయసున్న ప్రతి చిన్నారికీ తప్పనిసరిగా పోలియో చుక్కలు వేయించి, పోలియో రహిత సమాజాన్ని నిర్మిద్దామని సర్పంచ్ గర్దాస్ విక్రమ్ పిలుపునిచ్చారు. గ్రామపంచాయతీ కార్యాలయం వద్ద వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన పల్స్ పోలియో కార్యక్రమాన్ని ఆయన చిన్నారులకు చుక్కలు వేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ.. తల్లిదండ్రులు పూర్తి బాధ్యతతో తమ పిల్లలను కేంద్రాలకు తీసుకొచ్చి పోలియో చుక్కలు వేయించాలన్నారు. చిన్నారుల ఆరోగ్య పరిరక్షణే ధ్యేయంగా ప్రభుత్వం ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తోందని గుర్తుచేశారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ నల్ల స్వామి జయసుధ, ఎంఎల్‌హెచ్‌పీ జ్యోతి, ఆశా వర్కర్లు వరమ్మ, బాలమణి తదితరులు పాల్గొన్నారు.



## సౌర విద్యుత్‌తో రైతులకు అపార ప్రయోజనం

- పీఎం కుసుమ్ పథకం కింద రాష్ట్రంలోనే తొలి ప్లాంటు
- రామన్నపేట మండలం ఇంద్రపాలనగరంలో ప్రారంభం

**తొలివెలుగు, రామన్నపేట:** వ్యవసాయ రంగానికి మేలు చేసేలా సౌర విద్యుత్‌తో రైతులకు ఎంతో ప్రయోజనం కలుగుతుందని స్లింకో ఎనర్జీ ఇంజనీరింగ్ వైస్ ప్రెసిడెంట్ దీపక్ మనోడి అన్నారు. పీఎం కుసుమ్ పథకం కింద తెలంగాణలో మొట్టమొదటి సోలార్ ప్లాంట్‌ను రామన్నపేట మండలంలోని ఇంద్రపాలనగరం గ్రామంలో ఆదివారం ట్రాన్స్‌కో ఎస్ఈ సురేష్ ప్రారంభించారు. ఈ సందర్భంగా దీపక్ మనోడి మాట్లాడుతూ.. స్లింకో ఎనర్జీ ఇంజనీరింగ్ ఈపీసీ భాగస్వామ్యంతో పూర్తి స్థాయి సాంకేతిక మద్దతు అందిస్తూ ఈ ప్రాజెక్టును విజయవంతంగా అమలు చేశామన్నారు. రాబోయే రెండు వారాల్లో తెలంగాణ వ్యాప్తంగా మరో 10 నుంచి 15 ప్లాంట్లను ప్రారంభించనున్నట్లు వెల్లడించారు. ప్లాంట్ యజమానులు జీవనరెడ్డి, పద్మారావులను అధికారులు ప్రత్యేకంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో చౌటుప్పల్ డీఈ మల్లికార్జున్, డీఈ (ఎంఆర్‌టీ) విజయభాస్కర్, ఏడీఈ శ్రీకాంత్, ఏఈ కోటేశ్వరరావు, సబ్‌స్టేషన్ సిబ్బంది, ప్రాజెక్ట్ దేవలపర్లు, స్లింకో ఇంజనీర్లు తదితరులు పాల్గొన్నారు.



## నాణ్యత, శుభ్రతే ప్రామాణికం కావాలి

- వ్యాపారంలో వినియోగదారుల మన్ననలు పొందడమే లక్ష్యం
- ఆరాధ్య హోటల్ ప్రారంభోత్సవంలో కౌన్సిలర్ బత్తుల వాణి విప్లవ్ కుమార్



**తొలివెలుగు, చౌటుప్పల్:** దినదినాభివృద్ధి చెందుతున్న చౌటుప్పల్ మున్సిపాలిటీలో ప్రజలకు రుచికరమైన, ఆరోగ్యకరమైన ఆహారాన్ని అందించేలా హోటల్ నిర్వాహకులు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని 13వ వార్డు కౌన్సిలర్ బత్తుల వాణి విప్లవ్ కుమార్ సూచించారు. ఆహార పదార్థాల తయారీలో నాణ్యతా ప్రమాణాలు పాటించినప్పుడే వినియోగదారుల మన్ననలు పొందడం సాధ్యమవుతుందని ఆమె స్పష్టం చేశారు. చౌటుప్పల్ మున్సిపల్ కేంద్రం పరిధిలోని 13వ వార్డులో నూతనంగా ఏర్పాటు చేసిన 'ఆరాధ్య హోటల్'ను ఆదివారం ఆమె ముఖ్య అతిథిగా హాజరై లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా కౌన్సిలర్ బత్తుల వాణి విప్లవ్ కుమార్ గౌడ్ మాట్లాడుతూ.. ప్రస్తుత రోజుల్లో ప్రజలు ఆరోగ్యంపై తీవ్ర శ్రద్ధ వహిస్తున్నారని, అందువల్ల హోటళ్లలో పరిశుభ్రతకు పెద్దపీట వేయాలని కోరారు. స్వచ్ఛమైన వాతావరణంలో, కల్తీ లేని నాణ్యమైన ఆహార పదార్థాలను వినియోగదారులకు అందించడం ద్వారా వ్యాపారంలో దినదినాభివృద్ధి సాధించవచ్చని అభిప్రాయపడ్డారు. ఈ సందర్భంగా నూతనంగా వ్యాపారాన్ని ప్రారంభించిన హోటల్ యజమాని సతీష్‌కు ఆమె ప్రత్యేకంగా శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం హోటల్ యజమాని సతీష్.. ముఖ్య అతిథిగా విచ్చేసిన కౌన్సిలర్ బత్తుల వాణి విప్లవ్ కుమార్‌ను శాలువాతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో 14వ వార్డు కౌన్సిలర్ ఊడుగు జ్యోతి రమేష్ గౌడ్, 5వ వార్డు కౌన్సిలర్ కొయ్యడ శేఖర్ గౌడ్, కో-ఆప్షన్ మెంబర్ సందగళ్ళ విజయ సతీష్ గౌడ్, మాజీ కౌన్సిలర్ పోలోజు శ్రీధర్ బాబు, కాంగ్రెస్ నాయకులు చెవగోని వెంకటేష్ గౌడ్, వర్కాల కుమార్, స్థానిక ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

## మంగోరిగూడెంలో పోలీసుల విస్తృత తనిఖీలు

- 250 ఇళ్లలో కార్డన్ అండ్ సెర్చ్ ఆపరేషన్
- గుడుంబా తయారీ సామగ్రి, ఊట ధ్వంసం
- గంజాయి సమాచారం ఇస్తే రూ.5 వేల బహుమతి



**తొలివెలుగు, చిన్నగూడూరు:** మహబూబాబాద్ జిల్లా చిన్నగూడూరు మండలం మంగోరిగూడెం గ్రామంలో ఆదివారం తెల్లవారుజామున పోలీసులు భారీ కార్డన్ అండ్ సెర్చ్ ఆపరేషన్ నిర్వహించారు. జిల్లా ఎస్పీ, తొర్రూరు డీఎస్పీ ఆదేశాల మేరకు గ్రామంలో అసాంఘిక కార్యకలాపాలను అరికట్టడమే లక్ష్యంగా ఈ ఆకస్మిక తనిఖీలు చేపట్టారు. మరిపెడ సర్కిల్ పోలీసులతో పాటు క్యూఆర్టీ (క్యూ ఆర్ టీ) బలగాలు సంయుక్తంగా ఈ ఆపరేషన్‌లో పాల్గొన్నాయి. తెల్లవారుజామునే గ్రామాన్ని తమ ఆధీనంలోకి తీసుకున్న పోలీసులు, సుమారు 250 ఇళ్లతో పాటు పరిసర ప్రాంతాలను క్షుణ్ణంగా తనిఖీ చేశారు. ఈ సోదాల్లో అక్రమంగా నిల్వ ఉంచిన నల్లబెల్లం, పటిక, గుడుంబాను స్వాధీనం చేసుకున్నారు. అలాగే గుడుంబా తయారీకి సిద్ధంగా ఉంచిన నల్లబెల్లం ఊట (వాష్)ను అక్కడికక్కడే ధ్వంసం చేశారు.

**ప్రజలతో కమ్యూనిటీ కాంటాక్ట్ ప్రోగ్రామ్:**

తనిఖీల అనంతరం గ్రామస్తులతో పోలీసులు 'కమ్యూనిటీ కాంటాక్ట్' సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఐ కుశకుమార్ మాట్లాడుతూ.. అసాంఘిక శక్తులకు, నేరస్థులకు ఎట్టి పరిస్థితుల్లోనూ ఆశ్రయం ఇవ్వకూడదని హెచ్చరించారు. రోడ్డు భద్రతా నిబంధనలపై అవగాహన కల్పిస్తూ, ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, అతివేగంతో ప్రాణాపాయం పొంచి ఉంటుందని స్పష్టం చేశారు. మైనర్లకు సిగరెట్లు, పొగాకు ఉత్పత్తులు విక్రయిస్తే చట్టపరమైన కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు. గంజాయి విక్రయాలు, రవాణాపై ఉక్కుపాదం మోపుతున్నామని, దీనికి సంబంధించి కచ్చితమైన సమాచారం అందించిన వారికి రూ. 5,000 నగదు బహుమతి అందజేస్తామని ప్రకటించారు. సమాచారం ఇచ్చిన వారి వివరాలను పూర్తిగా గోప్యంగా ఉంచుతామన్నారు. నేరాల నియంత్రణకు ప్రతి వీధిలో సీసీటీవీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని గ్రామస్తులకు సూచించారు. ఈ భారీ ఆపరేషన్‌లో 8 మంది క్యూఆర్టీ సిబ్బందితో పాటు, మరిపెడ సర్కిల్‌కు చెందిన సుమారు 40 మంది పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.



## పోచంపల్లిలో విజయవంతంగా పల్స్ పోలియో

- మండల వ్యాప్తంగా 93.35 శాతం నమోదు
- కార్యక్రమాన్ని ప్రారంభించిన మున్సిపల్ వైస్ చైర్మన్ రజిని శ్రీనివాస్ గౌడ్
- నేడు ఇంటింటికీ వెళ్లి చుక్కల పంపిణీ

**తొలివెలుగు, భూదాన్ పోచంపల్లి:** పోలియో రహిత సమాజమే లక్ష్యంగా ఆదివారం భూదాన్ పోచంపల్లి మండల, పట్టణ వ్యాప్తంగా నిర్వహించిన పల్స్ పోలియో కార్యక్రమం విజయవంతంగా ముగిసింది. స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం (పీహెచ్‌సీ) ఆధ్వర్యంలో వైద్య సిబ్బంది ఈ కార్యక్రమాన్ని ప్రతిష్టాత్మకంగా చేపట్టారు. పోచంపల్లిలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఏర్పాటు చేసిన పోలియో బూత్‌లో మున్సిపల్ వైస్ చైర్మన్ కొయ్యడ రజిని శ్రీనివాస్ గౌడ్ ముఖ్య అతిథిగా హాజరై, చిన్నారికి పోలియో చుక్కలు వేసి కార్యక్రమాన్ని లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. "అప్పుడే పుట్టిన పసికందుల నుంచి ఐదేళ్ల లోపు వయసున్న చిన్నారులందరికీ తప్పనిసరిగా పల్స్ పోలియో చుక్కలు వేయించాలి. అప్పుడే వారి భవిష్యత్తు బంగారుమయంగా మారుతుంది. పిల్లల ఆరోగ్య పరిరక్షణ ప్రతి తల్లిదండ్రుల బాధ్యత" అని ఆమె స్పష్టం చేశారు. పోలియో మహమ్మారిని పూర్తిగా నిర్మూలించడంలో ప్రభుత్వ వైద్య సిబ్బంది కృషిని ఆమె అభినందించారు.

**3,680 మందికి పోలియో చుక్కలు:**

మండల వైద్యాధికారి డాక్టర్ శ్రీవాణి మాట్లాడుతూ.. మండల వ్యాప్తంగా పోలియో చుక్కల పంపిణీ కోసం మొత్తం 35 కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు. ఆదివారం ఒక్కరోజే 3,680 మంది చిన్నారులకు పోలియో చుక్కలు వేయడం జరిగిందని, ఇది మొత్తం లక్ష్యంలో 93.35 శాతంగా నమోదైందని వివరించారు. పోలియో చుక్కలు వేయించుకోలేకపోయిన మిగిలిన చిన్నారుల కోసం సోమవారం ఆశా కార్యకర్తలు, ఆరోగ్య సిబ్బంది ఇంటింటి సర్వే నిర్వహిస్తారని ఆమె తెలిపారు. సర్వేలో గుర్తించిన పిల్లలకు నేరుగా వారి ఇళ్ల వద్దే పోలియో చుక్కలు వేస్తామని, నూరు శాతం లక్ష్యాన్ని చేరుకుంటామని వైద్యాధికారి డాక్టర్ శ్రీవాణి స్పష్టం చేశారు.



## చిన్నారులకు శ్రీరామరక్ష.. పోలియో చుక్కలు

- పల్స్ పోలియోను సద్వినియోగం చేసుకోవాలి
- అంగవైకల్యం బారిన పడకుండా జాగ్రత్తలు తప్పనిసరి
- జలాల్‌పూర్ సర్పంచ్ శాపాక లింగస్వామి

**తొలివెలుగు, భూదాన్ పోచంపల్లి:** పుట్టిన బిడ్డ నుంచి ఐదేళ్లలోపు వయసున్న చిన్నారులందరికీ పల్స్ పోలియో చుక్కలు వేయించడం ద్వారా వారి భవిష్యత్తుకు భరోసా కల్పించవచ్చని జలాల్‌పూర్ గ్రామ సర్పంచ్ శాపాక లింగస్వామి అన్నారు. ఆదివారం గ్రామంలోని ప్రాథమిక పాఠశాల వద్ద ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన పల్స్ పోలియో కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన చిన్నారులకు స్వయంగా పోలియో చుక్కలు వేశారు. అనంతరం మాట్లాడుతూ.. రెండు పోలియో చుక్కలు చిన్నారుల ఆరోగ్యానికి శ్రీరామరక్ష వంటివని పేర్కొన్నారు. పిల్లలకు ఎలాంటి అంగవైకల్యం కలగకుండా ఉండాలంటే ప్రతి తల్లిదండ్రులు తమ పిల్లలకు తప్పనిసరిగా చుక్కలు వేయించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ కేసారం మధుసూదన్ రెడ్డి, ఏఎన్ఎం సుమతి, ఆశా వర్కర్ పద్మ, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.



# పేద విద్యార్థినులకు బాసటగా లయన్స్ క్లబ్

- చౌటుప్పల్‌లో ఉచిత సైకిళ్ల పంపిణీ
- దాత దాచేపల్లి రాజు ఆర్థిక సహకారం
- పాల్గొన్న క్లబ్ అధ్యక్షుడు జగన్నాథ్, ఇతర సభ్యులు



**తొలివెలుగు, చౌటుప్పల్:** గ్రామీణ ప్రాంతాలకు చెందిన పేద విద్యార్థినులు చదువు కోసం పడే కష్టాలను తీర్చేందుకు 'లయన్స్ క్లబ్ ఆఫ్ చౌటుప్పల్ సేవ' ముందుకొచ్చింది. పాఠశాలలకు రాకపోకలు సాగించేందుకు రవాణా సదుపాయం లేక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్న విద్యార్థినులకు ఆదివారం స్థానిక లయన్స్ భవన్‌లో ఉచితంగా సైకిళ్లను పంపిణీ చేశారు. లయన్స్ క్లబ్ సభ్యులు దాచేపల్లి రాజు ఆర్థిక సహకారంతో ఈ బృహత్తర కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా లయన్స్ క్లబ్ ఆఫ్ చౌటుప్పల్ సేవ అధ్యక్షుడు తిరందాసు జగన్నాథ్, ఇతర ప్రతినిధులు మాట్లాడుతూ.. "గ్రామీణ ప్రాంతాల్లోని పేద విద్యార్థులు బడికి వెళ్లేందుకు కిలోమీటర్ల కొద్దీ నడిచి వెళ్లాల్సిన పరిస్థితి ఉంది. వారి ఇబ్బందులను దృష్టిలో ఉంచుకునే ఈ సేవా కార్యక్రమాన్ని చేపట్టాం. ఈ సైకిళ్లు విద్యార్థినుల ప్రయాణ భారాన్ని తగ్గించడమే కాకుండా, వారి విద్యాభ్యాసాన్ని మరింత ప్రోత్సహిస్తాయి" అని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ ఆఫ్ చౌటుప్పల్ సేవ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ దాచేపల్లి ప్రకాష్ గుప్తా, కార్యదర్శి అతహర్ పాషా, కోశాధికారి సిలివేరు మంగయ్య, క్లబ్ జిల్లా కమిటీ సభ్యులు గోశిక కరుణాకర్, ఉప్పు ఆంజనేయులు, కాసుల వెంకటేశం, వేముల నరసింహ, చింతల ప్రభాకర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు. సైకిళ్లు అందుకున్న విద్యార్థినులు, వారి తల్లిదండ్రులు దాతలకు, క్లబ్ సభ్యులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

# నేడు చౌటుప్పల్‌లో 'ఇందిరమ్మ మహిళా శక్తి' చీరల పంపిణీ

- ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి ఆదేశాలతో..
- చైర్‌పర్సన్ మొగుదాల పావని రమేష్ గౌడ్ ఆధ్వర్యంలో కార్యక్రమం
- సకాలంలో హాజరుకావాలని ప్రజాప్రతినిధులకు పిలుపు



**తొలివెలుగు, చౌటుప్పల్:** తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న 'ఇందిరమ్మ మహిళా శక్తి' చీరల పంపిణీ కార్యక్రమం సోమవారం చౌటుప్పల్ మున్సిపాలిటీలో నిర్వహించనున్నారు. మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి ఆదేశాల మేరకు ఈ కార్యక్రమాన్ని ఉదయం 10:30 గంటలకు తంగడపల్లి రోడ్డులోని 'కళాశ్రీ' ఫంక్షన్ హాల్‌లో ఏర్పాటు చేశారు. పురపాలక సంఘం చైర్‌పర్సన్ మొగుదాల పావని రమేష్ గౌడ్ ఆధ్వర్యంలో చీరల పంపిణీ కార్యక్రమం లాంఛనంగా జరగనుంది. పట్టణంలోని అర్హులైన మహిళలకు ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలలో భాగంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్‌పర్సన్ మొగుదాల పావని రమేష్ గౌడ్ మాట్లాడుతూ, కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు మున్సిపల్ వైస్ చైర్మన్, కౌన్సిలర్లు, కోఆప్షన్ సభ్యులు, ప్రజాప్రతినిధులు సకాలంలో హాజరుకావాలని కోరారు. మహిళా సాధికారతకు ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోందని, 'ఇందిరమ్మ మహిళా శక్తి' కార్యక్రమం ద్వారా మహిళలకు మరింత ప్రోత్సాహం లభిస్తుందని పేర్కొన్నారు. చౌటుప్పల్ పట్టణంలోని మహిళలు పెద్ద సంఖ్యలో హాజరై ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని నిర్వాహకులు విజ్ఞప్తి చేశారు.

# నిరుపేదలకు అండగా సీఎం రిలీఫ్ ఫండ్

- రూ.60 వేల చెక్కును అందజేసిన కాంగ్రెస్ నాయకులు
- మునుగోడు ఎమ్మెల్యే రాజగోపాల్‌రెడ్డి సహకారంతో సాయం

**తొలివెలుగు, చౌటుప్పల్:** చౌటుప్పల్ మండలం రెడ్డిబావి గ్రామానికి చెందిన మాదగోని అండాలుకు మంజూరైన రూ.60 వేల సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కును ఆదివారం స్థానిక కాంగ్రెస్ నాయకులు అందజేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి చొరవతో పేదలకు ప్రభుత్వ పథకాలు సకాలంలో అందుతున్నాయని తెలిపారు. ప్రజా ప్రభుత్వం నిరుపేదలు, బలహీన వర్గాల సంక్షేమానికి పెద్దపీట వేస్తోందని, అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ ఫలాలను అందించడమే లక్ష్యమని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ గ్రామ శాఖ అధ్యక్షుడు నందగిరి పరమేష్, మాజీ అధ్యక్షుడు గంగాపురం వెంకటేశం, ఉపాధ్యక్షుడు ఆవుల రాజు, నందగిరి యాదయ్య, పల్లె వెంకటేశం, శ్యామల మల్లేష్, రేపాక శ్రీను, మాదగోని వంశీ, పిసాటి శేఖర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



# క్రీడా స్ఫూర్తితోనే ఉన్నత భవిష్యత్తు





- ఎల్బీనగర్ ఇండోర్ స్టేడియంలో అట్టహాసంగా 'జైన్ స్పోర్ట్స్ లీగ్ 2.0'
- గ్రామీణ క్రీడాకారులకు ప్రభుత్వ ప్రోత్సాహం: క్రీడా శాఖ మంత్రి వాకిటి శ్రీహరి
- తెలంగాణను స్పోర్ట్స్ హబ్‌గా మారుస్తాం: శాట్ చైర్మన్ శివసేనారెడ్డి
- హాజరైన టీపీసీసీ ప్రచార కమిటీ చైర్మన్ మధుయాష్కి గౌడ్




**తొలివెలుగు, ఎల్బీనగర్:** యువతలో దాగి ఉన్న అద్భుతమైన క్రీడా నైపుణ్యాలను వెలికితీసేందుకు క్రీడా టోర్నమెంట్లు ఎంతగానో దోహదపడతాయని రాష్ట్ర క్రీడా శాఖ మంత్రి వాకిటి శ్రీహరి పేర్కొన్నారు. జోమ్ సంస్థ సమర్పణలో జైన్ స్పోర్ట్స్ లీగ్ ఆధ్వర్యంలో 'జైన్ స్పోర్ట్స్ లీగ్ 2.0 బ్యాడ్మింటన్ టోర్నమెంట్-2026' ఎల్బీనగర్ ఇండోర్ స్టేడియంలో ఆదివారం అట్టహాసంగా ప్రారంభమైంది. రాష్ట్ర నలుమూలల నుంచి విచ్చేసిన క్రీడాకారులతో స్టేడియం ప్రాంగణం సందడిగా మారింది. ఈ ప్రతిష్టాత్మక క్రీడా పోటీలకు మంత్రి వాకిటి శ్రీహరితో పాటు టీపీసీసీ ప్రచార కమిటీ చైర్మన్ మధుయాష్కి గౌడ్, రాష్ట్ర క్రీడా ప్రాధికార సంస్థ (శాట్) చైర్మన్ శివసేనారెడ్డి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ?ఈ సందర్భంగా మంత్రి శ్రీహరి మాట్లాడుతూ.. చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించడం ద్వారా యువతలో శారీరక, మానసిక దృఢత్వం కలుగుతుందన్నారు. రాష్ట్రంలో క్రీడల అభివృద్ధికి ప్రభుత్వం అత్యధిక ప్రాధాన్యం ఇస్తోందని, ముఖ్యంగా గ్రామీణ స్థాయిలో ఉన్న ప్రతిభావంతులను గుర్తించి, వారికి మెరుగైన శిక్షణ అందించే దిశగా అడుగులు వేస్తున్నామని స్పష్టం చేశారు. ఇంతటి బృహత్తర కార్యక్రమాన్ని నిర్వహిస్తున్న జైన్ స్పోర్ట్స్ లీగ్ నిర్వాహకులను ఆయన ప్రత్యేకంగా అభినందించారు. అనంతరం శాట్ చైర్మన్ శివసేనారెడ్డి మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్రాన్ని దేశంలోనే ఒక మోడల్ 'క్రీడా హబ్'గా మార్చేందుకు శాట్ ఆధ్వర్యంలో పటిష్టమైన ప్రణాళికలు రచిస్తున్నామన్నారు. మైదానంలో గెలుపోటములను సమానంగా స్వీకరించి, నిజమైన క్రీడాస్ఫూర్తిని చాటాలని క్రీడాకారులకు సూచించారు. ఆధునిక మౌలిక సదుపాయాల కల్పనపై ప్రత్యేక దృష్టి సారించినట్లు ఆయన వివరించారు. ఈ కార్యక్రమంలో నిర్వాహకులు, స్థానిక ప్రజాప్రతినిధులు, క్రీడాభిమానులు పాల్గొన్నారు.

# పిల్లలకు రక్షణ కవచం.. 'పల్స్ పోలియో'





- పోలియో రహిత సమాజమే లక్ష్యం: చైర్‌పర్సన్ మొగుదల పావని రమేష్ గౌడ్
- చౌటుప్పల్ బస్టాండ్, ప్రభుత్వ ఆసుపత్రిలో పల్స్ పోలియో ప్రారంభం
- చిన్నారులకు చుక్కలు వేసి అవగాహన కల్పించిన చైర్‌పర్సన్

**తొలివెలుగు, చౌటుప్పల్:** పోలియో రహిత సమాజ నిర్మాణంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని చౌటుప్పల్ మున్సిపల్ చైర్‌పర్సన్ మొగుదల పావని రమేష్ గౌడ్ పిలుపునిచ్చారు. ఆదివారం చౌటుప్పల్ బస్టాండ్ ఆవరణలో, ప్రభుత్వ ఆసుపత్రిలో నిర్వహించిన పల్స్ పోలియో కార్యక్రమాన్ని ఆమె ముఖ్య అతిథిగా పాల్గొని లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా చిన్నారులకు ఆమె స్వయంగా పోలియో చుక్కలు వేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. చిన్నారుల భవిష్యత్తును అంగవైకల్యం లేనిదిగా మార్చేందుకు ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ఈ కార్యక్రమాన్ని చేపట్టిందని, తల్లిదండ్రులు బాధ్యతగా తమ ఐదేళ్ల లోపు పిల్లలందరికీ పోలియో చుక్కలు వేయించాలని కోరారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు కొసనం రాకేష్ రెడ్డి, పాక చిరంజీవి, చింతల ఉమామహేశ్వరి సాయిలు, ఎండీ హన్ను, బత్తుల జయమ్మ దాస్, డిప్యూటీ డిఎంహెచ్వో డాక్టర్ సుమన్ కళ్యాణ్, మండల వైద్యాధికారి డాక్టర్ కాటమరాజు, డాక్టర్ పాండురంగారావు, వైద్య సిబ్బంది, ఆశా వర్కర్లు, చిన్నారుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.



# అంకిరెడ్డిగూడెంలో విజయవంతంగా పల్స్ పోలియో

- 0-5 ఏళ్ల చిన్నారులకు పోలియో చుక్కల పంపిణీ
- చిన్నారులకు చుక్కలు వేసి ప్రారంభించిన సర్పంచ్ మల్లేష్ గౌడ్
- తల్లీబిడ్డల సంక్షేమమే లక్ష్యంగా అంగన్‌వాడీ, ఆశా వర్కర్ల కృషి

**తొలివెలుగు, చౌటుప్పల్ రూరల్:** యాదాద్రి భువనగిరి జిల్లా చౌటుప్పల్ మండల పరిధిలోని అంకిరెడ్డిగూడెం గ్రామపంచాయతీలో ఆదివారం నిర్వహించిన పల్స్ పోలియో కార్యక్రమం విజయవంతంగా ముగిసింది. పోలియో రహిత సమాజ నిర్మాణమే లక్ష్యంగా ప్రభుత్వం చేపట్టిన ఈ కార్యక్రమంలో భాగంగా 0 నుంచి 5 సంవత్సరాల లోపు వయస్సు గల చిన్నారులకు పోలియో చుక్కల మందు పంపిణీ చేశారు. గ్రామంలో ఏర్పాటు చేసిన పోలియో బూత్‌లో సర్పంచ్ సుర్వి మల్లేష్ గౌడ్ ముఖ్య అతిథిగా హాజరై ఓ చిన్నారికి పోలియో చుక్కలు వేసి కార్యక్రమాన్ని లాంఛనంగా ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. పోలియో మహమ్మారి బారిన పడి ఏ ఒక్క చిన్నారైనా అంగవైకల్యానికి గురికాకుండా చూడడమే ఈ కార్యక్రమం ప్రధాన ఉద్దేశమని తెలిపారు. తల్లిదండ్రులు తమ పిల్లల ఆరోగ్య భద్రతను దృష్టిలో ఉంచుకుని ఐదేళ్లలోపు చిన్నారులందరికీ ప్రతి విడతలో తప్పనిసరిగా పోలియో చుక్కలు వేయించాలని సూచించారు. గ్రామంలోని ప్రతి ఇంటికి సమాచారం అందించి నూరు శాతం లక్ష్య సాధనలో ఆశా, అంగన్‌వాడీ కార్యకర్తలు కీలక పాత్ర పోషించారని ఆయన అభినందించారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ వలందాసు మహేష్ గౌడ్, ఎంపీహెచ్ఏ (ఎఫ్) జి. పద్మ, ఆశా వర్కర్లు బొడిగె అమృత, బొల్లు అండాలు, అంగన్‌వాడీ టీచర్లు నల్ల జయప్రద, సప్పిడి కల్పనలతో పాటు మహిళలు, గ్రామ పెద్దలు, యువకులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.



గ్రామంలోని ప్రతి చిన్నారికి పోలియో చుక్కలు అందేలా ఆరోగ్య శాఖ సిబ్బంది ప్రత్యేక చర్యలు చేపట్టగా, గ్రామస్తులు కూడా కార్యక్రమానికి విశేష సహకారం అందించారు. దీంతో అంకిరెడ్డిగూడెంలో పల్స్ పోలియో కార్యక్రమం విజయవంతంగా పూర్తయింది.



# చిన్నారుల ఆరోగ్యమే.. మహాభాగ్యం!

- ఎస్. లింగోటంలో విజయవంతంగా పల్స్ పోలియో
- 0-5 ఏళ్ల చిన్నారులకు పోలియో చుక్కల పంపిణీ
- కార్యక్రమాన్ని ప్రారంభించిన సర్పంచ్ భీమిడి ప్రదీప్ జీ
- పోలియో రహిత గ్రామమే లక్ష్యంగా ముందుకు..

**తొలివెలుగు, చౌటుప్పల్ రూరల్:** చౌటుప్పల్ మండల పరిధిలోని ఎస్. లింగోటం గ్రామపంచాయతీ కార్యాలయంలో ఆదివారం పల్స్ పోలియో కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. పోలియో మహమ్మారిని తరిమికొట్టడమే లక్ష్యంగా 0 నుంచి 5 సంవత్సరాల లోపు వయసున్న చిన్నారులకు వైద్య సిబ్బంది చుక్కల మందు వేశారు. ఈ కార్యక్రమానికి గ్రామ సర్పంచ్ భీమిడి ప్రదీప్ జీ ముఖ్య అతిథిగా హాజరై, చిన్నారికి పోలియో చుక్కలు వేసి లాంఛనంగా ప్రారంభించారు. పీఏసీఎస్ వైస్ చైర్మన్ చెన్నగోని అంజయ్య విశిష్ట అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా సర్పంచ్ భీమిడి ప్రదీప్ జీ మాట్లాడుతూ.. "ప్రతి చిన్నారికి పోలియో చుక్కలు - పోలియో రహిత గ్రామం మనందరి లక్ష్యం" అని పిలుపునిచ్చారు. అర్హత కలిగిన ప్రతి చిన్నారికి విధిగా పోలియో చుక్కలు వేయించి, వారి భవిష్యత్తుకు బంగారు బాటలు వేయాలని గ్రామ ప్రజలకు ఆయన విజ్ఞప్తి చేశారు. ఈ బృహత్తర కార్యక్రమంలో గ్రామ ఉప సర్పంచ్ బాతరాజు ధనంజయ్య, వార్డు సభ్యులు తూర్పింటి సుజాత, ఉప్పు వీరేషం, బాతరాజు లింగస్వామి, పల్చం శంకర్, శేగురి లింగస్వామిలతో పాటు గ్రామ ఆరోగ్య సిబ్బంది, ఆశా కార్యకర్తలు, అంగన్‌వాడీ టీచర్లు, గ్రామ ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

# చౌటుప్పల్‌లో రికార్డు స్థాయిలో ధాన్యం కొనుగోళ్లు

- 4,381 మంది రైతుల నుంచి 5.98 లక్షల క్వింటాళ్ల సేకరణ
- మార్కెట్ కమిటీ చైర్మన్ ఉబ్బు వెంకటయ్య ఆధ్వర్యంలో సమీక్ష
- సహకరించిన ఎమ్మెల్యే రాజగోపాల్ రెడ్డికి కృతజ్ఞతలు



**తొలివెలుగు, చౌటుప్పల్:** చౌటుప్పల్ వ్యవసాయ మార్కెట్ కమిటీ పరిధిలో రబీ సీజన్ ధాన్యం కొనుగోళ్లు విజయవంతంగా ముగిశాయి. ఈ మేరకు ఆదివారం మార్కెట్ కమిటీ కార్యాలయంలో చైర్మన్ ఉబ్బు వెంకటయ్య అధ్యక్షతన సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మార్కెట్ పరిధిలో 12 పీఏసీఎస్, 18 ఐకేపీ, 4 ఎఫ్‌పీవో కేంద్రాల ద్వారా మొత్తం 4,381 మంది రైతుల నుంచి 5,98,239 క్వింటాళ్ల ధాన్యాన్ని సేకరించామని తెలిపారు. సేకరించిన ధాన్యానికి సంబంధించి రైతులకు చెల్లించాల్సిన నగదును వారి ఖాతాల్లో జమ చేయించినట్లు పేర్కొన్నారు. ధాన్యం కొనుగోళ్ల ప్రక్రియ సజావుగా సాగేందుకు సహకరించిన మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డికి, అలాగే జిల్లా కలెక్టర్, జాయింట్ కలెక్టర్, పౌరసరఫరాల శాఖాధికారులు, ఆర్డీవో, తహసీల్దార్, సిబ్బందికి ఆయన ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ ఆకుల ఇంద్రసేనారెడ్డి, పీఏసీఎస్ వైస్ చైర్మన్ చెన్నగోని అంజయ్య, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు బోయ దేవేందర్, పాలకవర్గ సభ్యులు, వ్యవసాయాధికారులు పాల్గొన్నారు.

# రైతు భరోసాకు దరఖాస్తుల ఆహ్వానం

- గడువు జూలై 5వ తేదీ వరకు పొడిగింపు

**- అర్హులైన రైతులందరూ ఏఈఓలను సంప్రదించాలి: ఏవో నాగరాజు**

**తొలివెలుగు, చౌటుప్పల్:** చౌటుప్పల్ మండలంలోని 18 రెవెన్యూ గ్రామాలకు చెందిన అర్హులైన రైతులు 'రైతు భరోసా' పథకం కోసం దరఖాస్తు చేసుకోవాలని మండల వ్యవసాయ అధికారి (ఏవో) ముత్యాల నాగరాజు కోరారు. గత నెల 15వ తేదీ లోపు కొత్తగా పట్టాదార్ పాస్‌బుక్ పొంది, డిజిటల్ సంతకం ఉన్న రైతులు ఈ పథకానికి అర్హులని ఆయన పేర్కొన్నారు. దరఖాస్తు చేసుకోవాలనుకునే రైతులు జూలై 5వ తేదీలోపు తమ పరిధిలోని వ్యవసాయ విస్తరణాధికారిని (ఏఈఓ) కలిసి దరఖాస్తులను అందజేయాలని సూచించారు. గతంలో దరఖాస్తు చేసుకోని రైతులు కూడా ఈ అవకాశాన్ని వినియోగించుకోవచ్చని ఆయన స్పష్టం చేశారు. రైతులు తమ పట్టా పాస్‌బుక్, ఆధార్ కార్డు, బ్యాంక్ ఖాతా పుస్తకం జిరాక్సులతో పాటు నింపిన దరఖాస్తు ఫారాలను ఏఈఓలకు సమర్పించాలని ఆయన కోరారు.



# ఆక్రమణల కోసమే కల్వర్టు కుదింపా..?

- 100 మీటర్ల కల్వర్టు.. 20 మీటర్లకు కుదింపు!
- అక్రమార్కుల కబంధహస్తాల్లో మొండికుంట కాలువ
- గతంలో కూల్చివేసిన చోటే ఇప్పుడు అక్రమ నిర్మాణాలు
- చూసీచూడనట్లు వ్యవహరిస్తున్న మున్సిపల్, ఆర్ అండ్ బి అధికారులు
- ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి వెంటనే స్పందించాలని ప్రజల డిమాండ్





గతంలో కూల్చిన స్థలంలోనే బారి నిర్మాణం

20 మీటర్ల కుదింపుతో బ్రిడ్జి నిర్మాణ పనులు

**తొలివెలుగు, చౌటుప్పల్:** చౌటుప్పల్ పురపాలక కేంద్రంలో అభివృద్ధి ముసుగులో అక్రమార్కులు తమ పంజా విసురుతున్నారు. చౌటుప్పల్-వలిగొండ-నాగారం ప్రధాన రోడ్డు విస్తరణ పనుల్లో భాగంగా అధికారులు అనుసరిస్తున్న తీరు ఇప్పుడు సర్వత్రా చర్చనీయాంశంగా మారింది. అభివృద్ధి పేరుతో 100 మీటర్ల పొడవు ఉండాల్సిన కల్వర్టును కేవలం 20 మీటర్లకు కుదించడం వెనుక బడా బాబుల హస్తం ఉందని స్థానికులు ఆరోపిస్తున్నారు.

**చరిత్ర పునరావృతం.. మారిన అధికార పార్టీ:**

సరిగ్గా 2020 అక్టోబర్ 29వ తేదీన 'ఈనాడు' పత్రికలో వచ్చిన కథనం చౌటుప్పల్ వాసులకు ఇప్పటికీ గుర్తుంది. అప్పట్లో మొండికుంట కాలువను ఆక్రమించి చేపట్టిన అక్రమ కట్టడాలను అప్పటి పురపాలక కమిషనర్ రామదుర్గారెడ్డి జేసీబీలతో కూల్చివేసి, కాలువను పునరుద్ధరించారు. ఆనాడు ప్రభుత్వం అక్రమమని తేల్చి కూల్చివేసిన అదే స్థలంలో, ఇప్పుడు మళ్ళీ అదే తరహా అక్రమ నిర్మాణాలు వెలుస్తుండటం గమనార్హం. గతంలో అక్రమమని కూల్చిన కట్టడాలకు, ఇప్పుడు మున్సిపల్ అధికారులు ఏ ప్రాతిపదికన అనుమతులు ఇచ్చారనేది మిలియన్ డాలర్ల ప్రశ్నగా మారింది.

**రాజకీయ అండతోనే కబ్జాలు?**

ఈ అక్రమ నిర్మాణాల వెనుక అధికార కాంగ్రెస్ పార్టీకి చెందిన ఒక కౌన్సిలర్, పలువురు ముఖ్య నాయకుల హస్తం ఉందని ప్రజలు బహిరంగంగానే చర్చించుకుంటున్నారు. రాజకీయ పలుకుబడిని అడ్డుపెట్టుకుని, తమ స్వార్థం కోసం మొండికుంట ప్రవాహ కాలువను కుదించి, కల్వర్టును 100 మీటర్ల నుండి 20 మీటర్లకు తగ్గించారని ఆరోపణలు వస్తున్నాయి. కేవలం ఒక భవన నిర్మాణానికి, భవిష్యత్తులో వరద ముప్పును కొనితెచ్చేలా అధికారులు వ్యవహరించడం పట్ల స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

**నిమ్మకు నీరెత్తినట్లు అధికారులు:**

మున్సిపల్ చైర్మన్, మున్సిపల్ కమిషనర్, ఆర్ అండ్ బీ అధికారులు అక్రమ నిర్మాణాలను చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారని ప్రజలు మండిపడుతున్నారు. నిబంధనలను తుంగలో తొక్కి, కాలువను ఆక్రమిస్తున్నా అడ్డుకునే నాథుడే లేకపోవడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. అక్రమార్కులకు కొమ్ముకాస్తున్న అధికారుల తీరుపై ప్రజలు తీవ్ర అసహనం వ్యక్తం చేస్తున్నారు.

**ఎమ్మెల్యే వెంటనే స్పందించాలి:**

స్థానిక ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి వెంటనే ఈ వ్యవహారంపై దృష్టి సారించాలని ప్రజలు కోరుతున్నారు. కల్వర్టును 100 మీటర్ల పొడవుతో యథావిధిగా నిర్మించాలని, కాలువ ఆక్రమణలను తొలగించి ప్రజల ప్రాణాలకు, ఆస్తులకు రక్షణ కల్పించాలని డిమాండ్ చేస్తున్నారు. మున్సిపల్ అధికారులు ఇప్పటికైనా అక్రమార్కులకు వత్తాసు పలకడం ఆపి, చట్టపరమైన చర్యలు తీసుకోవాలని వారు కోరుతున్నారు.


ఈనాడు
అక్రమ కట్టడం కూల్చివేత
Date : 29/10/2020 EditionName : TELANGANA ( YADADRI BHUVANAGIRI ) PageNo : 03

# జాతీయ స్థాయిలో అరుదైన గుర్తింపు.. డాక్టర్ ప్రశాంతి రెడ్డికి 'మోస్ట్ ట్రస్టెడ్' అవార్డు

- 'ప్రైడ్ ఆఫ్ హెల్త్‌కేర్ ఎక్సలెన్స్ అవార్డ్స్'లో సత్కారం
- హైదరాబాద్‌లో ఘనంగా అవార్డు ప్రదానం చేసిన సినీ నటి జయప్రద
- ౦ండు దశాబ్దాలుగా సంతాన సాఫల్యతలో విశేష కృషి

**తొలివెలుగు, చౌటుప్పల్/హైదరాబాద్:** వైద్య రంగంలో విశిష్ట సేవలు అందిస్తూ సంతానలేమితో బాధపడుతున్న వేలాది దంపతుల జీవితాల్లో ఆశాకిరణంగా నిలిచిన ప్రముఖ సంతానోత్పత్తి నిపుణురాలు, హైదరాబాద్‌లోని మదర్ హాస్పిటల్స్, ఐవీఎఫ్ సెంటర్, చౌటుప్పల్‌లోని ప్రశాంతి హాస్పిటల్ వ్యవస్థాపకురాలు, మెడికల్ డైరెక్టర్ డాక్టర్ ఈ. ప్రశాంతి రెడ్డి జాతీయ స్థాయిలో అరుదైన గౌరవాన్ని సొంతం చేసుకున్నారు. వైద్య రంగంలో ఆమె అందిస్తున్న అత్యుత్తమ సేవలకు గుర్తింపుగా ప్రతిష్ఠాత్మకమైన "ఇండియాస్ మోస్ట్ ట్రస్టెడ్ ఐవీఎఫ్ స్పెషలిస్ట్ ఆఫ్ ది ఇయర్-2026" అవార్డును అందుకున్నారు. హైదరాబాద్‌లోని ది పార్క్ హోటల్‌లో ఘనంగా నిర్వహించిన 'ప్రైడ్ ఆఫ్ హెల్త్‌కేర్ ఎక్సలెన్స్ అవార్డ్స్ అండ్ సమ్మిట్-2026' కార్యక్రమంలో ఈ పురస్కారాన్ని ఆమెకు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ప్రముఖ సినీ నటి, మాజీ రాజ్యసభ సభ్యురాలు జయప్రద డాక్టర్ ప్రశాంతి రెడ్డిని శాలువాతో ఘనంగా సత్కరించి అవార్డును అందజేశారు.

**రెండు దశాబ్దాల వైద్య సేవలకు అరుదైన గుర్తింపు:**

గత రెండు దశాబ్దాలుగా సంతానలేమితో బాధపడుతున్న దంపతులకు అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంతో కూడిన వైద్య సేవలను అందిస్తూ డాక్టర్ ప్రశాంతి రెడ్డి విశేష గుర్తింపు పొందారు. ఎన్నో క్లిష్టమైన కేసుల్లో విజయవంతమైన చికిత్సలు అందించి, పిల్లల కోసం ఎన్నో ఏళ్లుగా ఎదురుచూస్తున్న వేలాది కుటుంబాల్లో సంతాన సాఫల్యత ఆనందాన్ని నింపారు. అత్యాధునిక ఐవీఎఫ్, ఐసీఎస్ఐ, ఫెర్టిలిటీ ట్రీట్‌మెంట్ విధానాలను అందుబాటులోకి తీసుకువచ్చి, అధిక




విజయాల రేటుతో రోగుల విశ్వాసాన్ని సంపాదించుకున్నారు. ఈ సేవలకు గుర్తింపుగానే నిర్వాహకులు ఆమెను ఈ అత్యున్నత జాతీయ పురస్కారానికి ఎంపిక చేసినట్లు తెలిపారు.

**గ్రామీణ ప్రాంతాలకు కార్పొరేట్ స్థాయి వైద్యం:**

హైదరాబాద్‌లోని బోడుప్పల్‌లో మదర్ హాస్పిటల్స్ ఐవీఎఫ్ సెంటర్ ద్వారా అత్యాధునిక ఫెర్టిలిటీ చికిత్సలను అందిస్తూనే, చౌటుప్పల్ పట్టణంలోని ప్రశాంతి హాస్పిటల్ ద్వారా గ్రామీణ ప్రాంత ప్రజలకు కూడా నాణ్యమైన వైద్య సేవలను అందిస్తున్నారు. మహిళల ఆరోగ్య పరిరక్షణ, ప్రసూతి వైద్యం, గైనకాలజీ సేవలు, సంతానోత్పత్తి సమస్యల పరిష్కారంలో డాక్టర్ ప్రశాంతి రెడ్డి ప్రత్యేక గుర్తింపు పొందారు. కార్పొరేట్ ఆస్పత్రుల్లో మాత్రమే లభించే ఆధునిక వైద్య సేవలను గ్రామీణ ప్రాంతాలకు తీసుకువచ్చి, అందుబాటు ధరల్లో చికిత్స అందించడం ద్వారా ప్రజల మన్ననలు పొందారు. వేలాది కుటుంబాలకు ఆశాకిరణం సంతానలేమితో మానసిక వేదనకు గురవుతున్న అనేక కుటుంబాలకు డాక్టర్ ప్రశాంతి రెడ్డి కొత్త జీవితాన్ని ప్రసాదించారు. ఎన్నో సంవత్సరాల నిరీక్షణ తర్వాత ఆమె వైద్య సేవలతో తల్లిదండ్రులుగా మారిన దంపతులు ఆమెను దేవతగా భావిస్తూ కృతజ్ఞతలు తెలుపుతున్నారు. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని మానవీయ దృక్పథంతో మిళితం చేసి రోగులకు చికిత్స అందించడం, ప్రతి రోగి సమస్యను వ్యక్తిగతంగా పరిగణించి సరైన మార్గదర్శనం చేయడం ఆమె ప్రత్యేకతగా వైద్య వర్గాలు పేర్కొంటున్నాయి.

**వైద్య వర్గాల హర్షం:**

డాక్టర్ ఈ. ప్రశాంతి రెడ్డికి జాతీయ స్థాయి అవార్డు దక్కడం పట్ల హైదరాబాద్ వైద్య వర్గాలతో పాటు చౌటుప్పల్ ప్రజలు, ప్రశాంతి హాస్పిటల్ సిబ్బంది, సహచర వైద్యులు, రోగులు, శ్రేయోభిలాషులు హర్షం వ్యక్తం చేశారు. ఈ అవార్డు ఆమె నిరంతర కృషికి, అంకితభావానికి, నిబద్ధతతో కూడిన వైద్య సేవలకు లభించిన గొప్ప గుర్తింపు అని కొనియాడారు. భవిష్యత్తులో మరింత ఆధునిక వైద్య సేవలను ప్రజలకు అందుబాటులోకి తీసుకువచ్చి, మరిన్ని కుటుంబాల్లో ఆనందం నింపేందుకు కృషి చేస్తామని హాస్పిటల్ ప్రతినిధులు తెలిపారు. డాక్టర్ ప్రశాంతి రెడ్డి సాధించిన ఈ జాతీయ గౌరవం తెలంగాణ వైద్య రంగానికే కాకుండా చౌటుప్పల్ ప్రాంత ప్రజలకు కూడా గర్వకారణంగా నిలిచిందని పలువురు అభిప్రాయపడ్డారు.